

# నేటి నిజం

తెలుగు దినపత్రిక





website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 29-8-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక:24 | పేజీలు: 4 | వెల: రూ.1/-


# కులవృత్తులకు కెసిఆర్ పెద్దపీట

## మత్స్యకారుల అభివృద్ధికి చేపపిల్ల పంపిణీ

## పలు అంశాలపై సమీక్షించిన మంత్రులు

హైదరాబాద్,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): మత్స్యకారుల అభివృద్ధి, మత్స్య సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం మరింత కషి చేస్తుందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కొత్త పంచాయతీరాజ్ చట్టం, చెరువుల్లో చేప పిల్లల విత్తనాలు వేయడం, చేపల చెరువులో మత్స్య సహకార సంఘాలకు చెరువుల కేటాయింపు తదితర అంశాలపై మంత్రులు చర్చించారు. ఇందులో రాజ్యసభ సభ్యుడు బండా ప్రకాశ్, పంచాయతీరాజ్, పశు సంవర్ధక శాఖల కార్యదర్శులు, కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. అడుగంటిన కుల వృత్తులను ఆదుకోవడానికి సీఎం కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగా, మత్స్యకారుల అభివృద్ధికి చెరువుల్లో చేపల విత్తనాలను ఉచితంగా అందజేస్తుందన్నారు. దీంతో మత్స్య సంపద పెరిగి, చేపలు పట్టేవారికి ఆదాయం పెరిగి మంచి అభివృద్ధిని సాధిస్తున్నారన్నారు. కొత్తగా ఏర్పడ్డ గ్రామ పంచాయతీల్లో కొన్ని సమస్యలు వస్తున్నట్ల తమ దృష్టికి వచ్చిందన్నారు. వాటిని స్థానికంగానే నిబంధనలను అనుసరించి పరిష్కరించు కోవాలని సూచించారు. అయితే, నిబంధనల ప్రకారమే చెరువుల కేటాయింపులు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను, డీ పీలోలను ఆదేశించాలని సెక్రెటరీల ను మంత్రులు ఆదేశించారు.



. హైదరాబాద్ ఐఐటి రూపొందించిన అధునాతన ఎన్-95 మాస్కులను విడుదల చేసిన ఐట ఇసెక్రటరీ జయేశ్ రంజన్

# కొత్త తరహా మాస్కు తయారు చేసిన స్టార్టప్

హైదరాబాద్,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): నగరంలోని ఐఐటీకి చెందిన సెంటర్ ఫర్ హెల్త్‌కేర్ ఎంట్రిప్రెన్యూర్‌షిప్(సీఎఫ్‌హెచ్‌ఈ) ప్రోత్సహిస్తున్న యూ సేఫ్ హెల్త్‌కేర్ అనే స్టార్ట్ అప్ కొత్త తరహా మాస్క్‌ను తయారు చేసింది. ఎన్95 తరహా లాంటి మాస్క్‌ను ఆ స్టార్ట్ అప్ డెవలప్ చేసింది. కరోనా వైరస్ నేపథ్యంలో మాస్క్‌లకు ఫుల్ డిమాండ్ ఉన్న విషయం తెలిసిందే. యూఎస్9 పేరుతో ఆ మాస్క్‌లను విడుదల చేశారు. గాంధీ, ఒస్మానియా, ఫీవర్ హాస్పిటల్స్‌లో పనిచేసే వైద్యులు ఆ మాస్క్‌లను టెస్ట్ చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న ఎన్95 మాస్క్‌ల కన్నా తక్కువ ధరకే యూఎస్9 మాస్క్‌లను విక్రయించనున్నారు. యూఎస్9 మాస్క్‌ను మళ్లీ మళ్లీ వాడేవిధంగా తయారు చేశారు. మాస్క్ ఫిల్ట్రేషన్ రేటు 98 శాతంగా ఉన్నది. బ్యాక్టీరియా ఫిల్ట్రేషన్ 99.7 శాతంగా ఉన్నది. బ్రీత్‌ఎబిలిటీ పరీక్షలను యూఎస్9 మాస్క్‌లు పాసైనట్లు స్టార్ట్ అప్ ఓనర్లు చెప్పారు. మాస్క్‌లో డ్యుయల్ మోడ్‌కు చెందిన రీయూజబుల్, రీప్లేసబుల్ ఫిల్టర్లు ఉన్నాయి. సౌత్ ఇండియా టెక్స్‌టైల్ రీసర్చ్ అసోసియేషన్ కూడా మాస్క్ ఫిల్ట్రేషన్ క్యాట్రిడ్జ్‌లకు సర్టిఫికెట్ ఇచ్చింది.

# 139 మంది రేప్ కేసులో పోలీసులు ఆరా

## డాలర్ బాయ్ బెదిరింపులపై దృష్టి

హైదరాబాద్,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): తనను 139 మంది రేప్ చేశారంటూ ఓ యువతి పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసిన కేసు దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. ఈ కేసులో 139 మంది పాత్రపై పోలీసులు ఆరా తీస్తున్నారు. బాధితురాలు వెల్లడించిన ప్రముఖుల పాత్రపై విచారణ జరుగుతోంది.

పోలీసుల దర్యాప్తులో డాలర్ బాయ్ అనే వ్యక్తి బెదిరింపులు వెలుగు చూశాయి. డాలర్ బాయ్ పలువురికి ఫోన్‌లు చేసి బెదిరించినట్టు కూడా తెలుస్తోంది. డాలర్ బాయ్, డిటెక్టివ్ పాత్రపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో డాలర్ బాయ్ అరాచకాలపై బాధితులు ఫిర్యాదు చేశారు. ఘటనపై ఇప్పటికే యాంకర్ ప్రదీప్ స్పందించారు. కేసును తప్పుదోవ పట్టిస్తున్నారా అనే అంశంపై సైతం పోలీసులు దృష్టి సారిస్తున్నారు. ఓ కానిస్టేబుల్‌కి కాల్ చేసి.. 'నీ భార్యతో నాకు అక్రమ సంబంధం ఉంది' అంటూ వేధింపులకు దిగినట్టు తెలుస్తోంది. కుమార్ అనే పేరుతో బ్లాక్ మెయిల్ చేస్తున్నట్టు సమాచారం. ఆ కానిస్టేబుల్ పని చేస్తున్న స్టేషన్ ఎస్సైను అసభ్య పదజాలంతో దూషించినట్టు సమాచారం. డాలర్ బాయ్ అరాచకాలపై ఆడియో టేపులను కానిస్టేబుల్ పోలీసులకి అందజేసినట్టు తెలుస్తోంది. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ నుండి కేసును సీసీఎస్ కి బదిలీ చేసారు. కేసు డైరీని సీసీఎస్ పోలీసులకు అందజేసిన పంజాగుట్ట పోలుసులు... 139 మంది పై ఆరోపణల్లో ఎవరు నిందితులు, ఎవరు భాదితులు అనే కోణంలో విచారణ చేస్తున్నారు. యాంకర్ ప్రదీప్ పై సంచలన ఆరోపణలు చేస్తున్న భాదితురాలు... 139 మందిలో కొంత మందివి మాత్రమే ఆధారాలు పోలీసులకు అందజేసినట్లు సమాచారం. డాలర్ బాయ్ వ్యవహారం పై సీసీఎస్ పోలీసులు నిఘా పెట్టారు. ఇప్పటికే భాదితురాలు స్టేట్మెంట్ ను పోలీసులు రికార్డ్ చేశారు. తమ ప్రమేయం లేకపోయినా ఉద్దేశ పూర్వకంగా ఇరికించారని పలువురు పోలీసులకు ఫిర్యాదు చేసారు. డాలర్ బాయ్ చేర నుండి భాదితురాలను తప్పించి, ప్రభుత్వ హోంకి పోలీసులు తరలించనున్నారు. ఈ కేసుపై ఇంకా విచారణ కొనసాగుతున్నది.







కిన్నెర ఆర్ట్ థియేటర్స్,
నేటినిజం తెలుగు దినపత్రిక,
మరియు
పి.వి.మనోహరరావు గారి
సౌజన్యంతో
భారత పూర్వ ప్రధాని పి.వి.నరసింహారావు గారి
శత జయంతి సందర్భంగా




పి.వి.నరసింహారావు
జీవితం- వ్యక్తిత్వం- సాహిత్యం ఇతివృత్తంగా

వ్యాస రచనల పోటి

ఉత్తమ బహుమతి : రూ.5000/-
ద్వితీయ బహుమతి : రూ.3000/-,
తృతీయ బహుమతి : రూ.2000/-

- రచనలు ఎ4 సైజు పేపరులో 4 పేజీలు తగ్గకుండా/ మించకుండా ఉండాలి.
- వ్యాసాలు ఏ పత్రికలో ప్రచురించలేదని సోషల్ మీడియాలో పోస్ట్ చేయలేదని, ఈ పోటీ నిమిత్తమే వ్రాసినదని, హామీ పత్రం జతచేయాలి.
- హామీ పత్రంలో మీ పేరు, ఫోటో, పూర్తి చిరునామా, సెల్ నెం.తప్పనిసరి.

రచనలు పంపిలసిన చిరునామా:
నేటినిజం దినపత్రిక,
ఎస్.ఆర్.టి-74, జవహర్‌నగర్,
అశోక్‌నగర్, హైదరాబాద్-20
netinizam2020@gmail.com

రచనలు పంపవలసిన
చివరి తేది
30-09-2020




రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధి సీతారాంపేట గ్రామ సమీపంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో గోదాం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం మంత్రి సబితా ఇంద్రారెడ్డితో పసమావేశమైన నాబార్డ్ చైర్మన్ చింతల గోవింద రాజులు.

# జెఇఇ,నీట్ పరీక్షలను వాయిదా వేయండి

## సుప్రీంలో ఆరు రాష్ట్రాల రివ్యూ పిటిషన్

న్యూఢిల్లీ,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలైన జేఈఈ, నీట్ వాయిదా కోరుతూ ఓ వైపు కాంగ్రెస్ తదితర పార్టీలో ఆందోళనకు దిగగా... ఆరు రాష్ట్రాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, పంజాబ్, మహారాష్ట్రకు చెందిన మంత్రులు సంయుక్తంగా శుక్రవారం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. జేఈఈ, నీట్ నిర్వహణపై ఆగస్టు 17న సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను సమీక్షించాలని కోరారు. ఒకవైపు కరోనా మహమ్మారి, మరోవైపు భారీ వర్షాలు, వరదల వల్ల తమ తమ రాష్ట్రాల్లో పరీక్షలు నిర్వహించలేని పరిస్థితులు నెలకొన్నాయిని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జేఈఈ, నీట్ పరీక్షలను వాయిదా వేయాలని ఆయా రాష్ట్రాల ముంత్రులు సుప్రీంకోర్టును అభ్యర్థించారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ ఆధ్వర్యంలో బుధవారం ప్రతిపక్ష పార్టీల పాలిత ఏడు రాష్ట్రాల సీఎంల ఆన్‌లైన్ సమావేశం జరిగింది. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, మహారాష్ట్ర సీఎం ఉద్ధవ్ ఠాక్రే, పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్, రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్, ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేష్ బాగెల్, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌తోపాటు కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరి సీఎం నారాయణ స్వామి పాల్గొన్నారు. జీఈఈ, నీట్ వాయిదాకు ఉమ్మడిగా పోరాడాలని, సుప్రీంకోర్టులో సమీక్ష కోరాలని ఈ సందర్భంగా సీఎంలు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆరు రాష్ట్రాలకు చెందిన మంత్రులు సంయుక్తంగా సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. జేఈఈ, నీట్ వాయిదాకు పలు రాష్ట్రాల సీఎంలు ప్రధాని మోదీకి లేఖలు కూడా రాశారు. అయితే కరోనా నేపథ్యంలో ఇప్పటికే చాలాసార్లు వాయిదా పడిన ఈ పరీక్షలను ఈసారి నిర్వహించాలన్న పట్టుదలతో కేంద్ర ప్రభుత్వం ఉన్నది. దీంతో జేఈఈ, నీట్ నిర్వహణకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) అన్ని ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే 85 శాతం మంది అభ్యర్థులు హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నట్లు పేర్కొంది. సెప్టెంబర్ 1 నుంచి 6 వరకు జేఈఈ మెయిన్స్, సెప్టెంబర్ 13న నీట్ జరుగనున్నాయి.

# నగరంలో ఆహ్లాదకర వాతావరణం కోసం పార్కులు

## కొత్తగా 320 ఏర్పాటు చేయనున్నట్లు మేయర్ వెల్లడి

హైదరాబాద్,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): నగరవాసులకు ఆహ్లాదకర వాతావరణాన్నిఅందించేందుకు కొత్తగా 320 పార్కులు, 50 థీమ్ పార్కులను ఏర్పాటు చేయనున్నట్లు హైదరాబాద్ నగర మేయర్ బొంతు రామ్మోహన్ తెలిపారు. మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు హైదరాబాద్‌లోని అన్ని పార్కుల్లో జీహెచ్ఎంసీ వారం రోజులపాటు క్లీన్‌నెస్ డ్రైవ్ చేపట్టింది. ఈ సందర్భంగా బంజారాహిల్స్‌లోని గ్రీన్ వ్యాలీలోని సీడబ్ల్యూఏ పార్కుల్లో చేపట్టిన క్లీన్‌నెస్ డ్రైవ్‌ను మేయర్ అధికారులతో కలిసి పరిశీలించారు. సీఎం కేసీఆర్ ఆకాంక్షలకు అనుగుణంగా మంత్రి కేటీఆర్ ఆదేశాలతో హైదరాబాద్‌ను హరిత నగరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టినట్లు ఈ సందర్భంగా తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్‌లో 900 పార్కులు ఉన్నాయన్న ఆయన నిరుపయోగంగా ఉన్న పార్కులకు పూర్వవైభవం తీసుకురానున్నట్లు చెప్పారు. పార్కుల్లో వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రేటర్ పరిధిలో శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చివేయనున్నట్లు తెలిపారు. అనుమతిలేని అక్రమ కట్టడాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదన్నారు.

# కరోనాపై పోరులో ఇంకా తుదిదశకు రాలేదు

## ఈ తరుణంలో జాతీయ ప్రవేశ పరీక్షలు తగదు

## వెంటనే వాయిదా వేయాలన్న సచిన్ పైలట్

జైపూర్,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి నేపథ్యంలో జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్స్ (జేఈఈ), నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) పరీక్షలను కేంద్రం వాయిదా వేయాలని రాజస్థాన్ కాంగ్రెస్ నేత, మాజీ డిప్యూటి సిఎం సచిన్ పైలట్ డిమాండ్ చేశారు. సెప్టెంబర్‌లో నీట్, జేఈఈ పరీక్షలు జరపాలన్న నిర్ణయానికి వ్యతిరేకంగా పైలట్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జైపూర్‌లో శుక్రవారంనాడు నిరసన కార్యక్రమాలు నిర్వహించింది. దేశంలో కోవిడ్ కేసులు పెరుగుతుండటం, ప్రపంచ దేశాల్లోనూ అనేక కార్యక్రమాలు వాయిదా పడుతున్న నేపథ్యంలో ఎంట్రన్స్ పరీక్షలు సైతం వాయిదా వేయాలని పైలట్ ఈ సందర్భంగా అన్నారు. ఈ అంశం జీవన్మరణ సమస్య. పరీక్షల వాయిదాకు ఎన్ఎస్‌యూఐ పనిచేస్తుంది. రోజురోజుకూ వైరస్ వ్యాప్తి పెరుగుతోంది. కోవిడ్‌పై పోరాటం ఇంకా తుదిదశకు రానందున. కేంద్రం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో విద్యార్థులు, వారి కుటుంబ సభ్యుల ప్రాణాలు ప్రమాదంలో పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు ఎలా వెళ్లగలుగుతారు? ఇంకా కోవిడ్ కేసులు చాలా ఉన్నప్పుడు మీ పిల్లలు తమతమ ప్రాంతాల నుంచి ఎలా వస్తారని పైలట్ ప్రశ్నించారు. ప్రభుత్వం మొండిపట్టుదలకు పోరాదని, అందరి విజ్ఞప్తులను ఆలకించాలని కోరారు. కాగా, దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కాంగ్రెస్, ఆ పార్టీ విద్యార్థి విభాగమైన ఎన్ఎస్‌యూఐ శుక్రవారంనాడు పలు నిరసన ప్రదర్శనలు నిర్వహించింది. ఢిల్లీ, తమిళనాడు, రాజస్థాన్, కర్ణాటక, ఉత్తారాఖండ్, బీహార్, గుజరాత్ సహా పలుచోట్ల ఆందోళనలు జరిగాయి.

# సాగు నీరు అందించి సీఎం కేసీఆర్ చరిత్రలో నిలిచిపోయారు



యాదాద్రి భువనగిరి, ఆగష్టు 28: సబ్బండ వర్ణాల అభివృద్ధే టీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అంబాల గ్రామంలో బిక్కు వాగుపై చెక్ డ్యాం పనులను జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డితో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు.

అనంతరం ఆమె మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం టీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తాగు, సాగు నీటి కోసం ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణాలను చేపట్టిందన్నారు. రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం త్వరలోనే ప్రారంభిస్తుందని పేర్కొన్నారు. రైతుల కోసం ఉచిత విద్యుత్, రుణమాఫీ, సాగునీరు అందించి రైతు పక్షపాతిగా చరిత్రలో ముఖ్యమంత్రి కేసీఆర్ నిలిచిపోయారని అన్నారు.

# వెంటనే మహిళా కమిషన్ ఏర్పాటు చేయండి

## మహిళకు న్యాయం చేయండి: కోదండరామ్

యాదాద్రి,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన రేప్ కేసులో బాధిత యువతికి ప్రభుత్వం న్యాయం చేయాలని తెలంగాణ జనసమితి నేత కోదండరాం డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు ఇక్కడ పర్యటించిన ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న పలు అంశాలపై ఆయన స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు మహిళా కమిషన్‌ను ఏర్పాటు చేయలేదని విమర్శించారు. మహిళా కమిషన్‌ను ఏర్పాటు చేసి బాధిత మహిళలకు అండగా ఉండాలని పేర్కొన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం తప్పుడు నిర్ణయాలు తీసుకుంటోందని కోదండరాం విమర్శించారు. టీఆర్ఎస్ నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా మిత్రపక్షాలతో కలిసి పోరాడతామని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడంపై పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆస్పత్రులు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించిన తరువాతే సచివాలయం వంటి నిర్మాణాలను చేపట్టాలని ప్రభుత్వానికి కోదండరాం సూచించారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తన సౌకర్యాలపై ఉన్న శ్రద్ధ ప్రజా భద్రతపై లేదని దుయ్యబట్టారు.

# యూనిసెఫ్ హెచ్చరికలను పరిశీలించాలి

నేటినిజం
శనివారం 29-8-2020

భారతదేశవ్యాప్తంగా కేవలం 24 శాతం ప్రజల ఇండ్లల్లో మాత్రమే ఇంటర్నెట్ సౌకర్యం ఉన్నదని, ప్రభుత్వాలు ఆన్‌లైన్ పాఠాలు ప్రారంభిస్తే పిల్లలందరికీ చేరే అవకాశం చాలా తక్కువని యునిసెఫ్ తాజా నివేదికలో స్పష్టం చేసింది. ఈ 24 శాతంలో కూడా పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువ కనెక్షన్లు ఉన్నాయని, గ్రామీణ ప్రాంతాల్లో లేవని పేర్కొన్నది. కరోనా నేపథ్యంలో విద్యాసంవత్సరం వృథా కాకుండా ఆన్‌లైన్ పాఠాలు ప్రారంభించాలని ప్రభుత్వాలు భావిస్తున్న తరుణంలో ఈ నివేదిక వెల్లడి కావడం గమనార్హం. ప్రస్తుత పరిస్థితుల్లో బడి పిల్లలకు ఆన్‌లైన్ పాఠాలు ప్రారంభిస్తే పేద, మధ్యతరగతి, ధనిక కుటుంబాల మధ్య అంతరాలు పెరిగి.. పిల్లల మధ్య డిజిటల్ డివైడ్‌కు దారి తీయవచ్చని తెలిపింది. సాధ్యమైనన్ని జాగ్రత్తలతో భౌతికంగా బడులు తెరవడమే మేలని కూడా సూచించింది. ఇప్పుడే తెరవలేని పరిస్థితులుంటే సిలబస్‌ను తగ్గించడం, లేదా తర్వాతి కాలంలో సెలవుల్లోనూ క్లాసులు నిర్వహించడం లాంటివి చేయాల్సి రావచ్చు. మరోవైపు పల్లెలకు ఇంటర్నెట్ విస్తరిస్తేనే అభివృద్ధి పెరుగుతుందని మంత్రి కెటిఆర్ కూడా తెలిపారు. ఈ దశలో ఆన్‌లైన్ క్లాసులు వల్ల ప్రయోజనాలు ఏంటన్నది ఆలోచించాల్సి ఉంది. పాఠశాలలను సెప్టెంబరు 1 నుంచి ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పాఠశాలల్లో ప్రవేశాలతో పాటు దూర విద్యావిధానంలో ఆన్‌లైన్ పాఠాలను బోధించనున్నారు. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలంటూ విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్ర రామచంద్రన్ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. కరోనా వైరస్ విద్యా సంవత్సరాన్ని దెబ్బతీయడంతో విద్యార్థులంతా ఇంటికే పరిమితం అయ్యారు. జూన్ రెండో వారంలో ప్రారంభం కావలసిన పాఠశాలలు ఇప్పటికీ తెరుచుకోలేదు. కరోనా వల్ల విద్యా సంవత్సరం నష్టపోకుండా విద్యాశాఖ ప్రత్యామ్నాయ చర్యలకు శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో విద్యార్థులను ఇంటి వద్దనే ఉంచుతూ ఆన్‌లైన్ ద్వారా పాఠాలు బోధించేందుకు కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో విద్యార్థులు డిజిటల్ పాఠాలను నేర్చుకోవడంతోపాటు వాటిని ప్రాక్టీస్ చేసేందుకు అవసరమైన వర్క్‌షీట్లను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. 2 నుంచి 10 తరగతుల విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు వాటిని ఎన్‌సీఈఆర్టీ అధికారిక వెబ్ సైట్ ద్వారా తెలుగు, హిందీ, ఉర్దూ, ఇంగ్లీష్ భాషల్లో అన్ని సబ్జెక్టులు డౌన్‌లోడ్ చేసుకొనే విధంగా వర్క్‌షీట్లు రూపొందించారు. ఆన్‌లైన్ తరగతుల నిర్వహణ వల్ల ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాల్లో చదివే దాదాపు విద్యార్థులకు మేలు జరుగనుందని అంచనా వేస్తున్నారు. అయితే ప్రైవేటు పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థుల తల్లిదండ్రులకు దాదాపు మొబైల్ ఫోన్‌లు, టీవీలు అందుబాటులో ఉండగా, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఇళ్లలో పూర్తిస్థాయిలో అందుబాటులో లేక ఆన్‌లైన్ విద్యకు ఆటంకం కలిగే అవకాశాలు ఉన్నాయి. ఎలాంటి సౌకర్యాలు లేని విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించడం సవాలుగా మారనుంది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు ప్రతిరోజు ఆన్‌లైన్ తరగతులకు కేటాయించే సమయాన్ని కూడా ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందులో తరగ తుల వారీగా నిర్వహించే సబ్జెక్టులు, కేటాయించిన సమయంపై నిర్దిష్టమైన ఆదేశాలు ఇచ్చింది. కిండర్ గార్డెన్, నర్సరీ, ప్లే స్కూల్, ప్రీ స్కూల్ విద్యార్థులకు రోజుకు 45 నిమిషాలు మించకుండా వారంలో మూడు రోజులు మాత్రమే తరగతులు తల్లిదండ్రులు, వయోజన పర్యవేక్షకుల సమక్షంలో నిర్వహించాల్సి ఉంటుంది. వీరికి గరిష్ట స్క్రీన్ సమయం 45 మిషాలు ఉంటుంది. అలాగే 1 నుంచి 5వ తరగతుల వారికి రోజుకు 30–45 నిమిషాలకు మించకుండా వారంలో 5 రోజుల పాటు తరగతులు నిర్వహించాలి. స్క్రీన్ సమయం 1.5 గంటలు. 6 నుంచి 8 తరగతుల వారికి 30–45 నిమిషాల పాటు మూడు సెషన్లకు మించరాదు. 2 గంటలపాటు స్క్రీన్ అందుబాటులో ఉంటుంది. 8 నుంచి 12 తరగతుల విద్యార్థులకు 30 నుంచి 45 నిమిషాల నాలుగు సెషన్లకు మించకుండా వారంలో ఐదు రోజుల పాటు నిర్వహించాలి. వీరికి మూడు గంటలు స్క్రీన్ అందుబాటులో ఉంచుతారు. తెలంగాణలో ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు ఆన్‌లైన్‌లో విద్యాబోధన చేసేందుకు గాను తమకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను, సాధ్యాసాధ్యాలపై ఉపాధ్యాయులు సమీక్షించారు. స్టాఫ్‌మీటింగులు పెట్టుకుని బోధనకు కావాల్సిన సదుపాయాల సమీకరణపై చర్చించారు. తరగతుల వారీగా విద్యార్థుల వివరాలు, వారి ఫోన్ నెంబర్ల జాబితా సిద్ధం చేసి, తల్లిదండ్రులతో మాట్లాడడం లాంటి ప్రాథమిక విధులకు పరిమితమయ్యారు. కొన్నిచోట్ల గ్రామాల్లోకి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు ఆన్‌లైన్ తరగతులపై అవగాహన కల్పించారు. మొత్తం మీద ప్రభుత్వ ఆదేశాలతో ఐదు నెలల తర్వాత ప్రభుత్వ పాఠశాలలు తెరుచు కోవడంతో ఈ విద్యాసంవత్సరంలో విద్యాబోధన ప్రణాళిక దశలవారీగా అమలయ్యే పరిస్థితి కనిపిస్తోంది. అయితే దేశవ్యాప్తంగా ఇలాంటి సమస్యలే ఇంచుమించు ఉన్నాయి. వీటిని అధిగమించేందుకు కేంద్రం కార్యాచరణ సిద్ధం చేయాలి. అప్పుడే సమస్యలు అధిగమించి ముందుకు సాగగలం. యూనిసెఫ్ హెచ్చరికల నేపథ్యంలో ముందుకు నడవాల్సి ఉంది. కరోనా సంక్షోభం మరెంత కాలం ఉంటుందో తెలియని పరిస్థితుల్లో ముందుకు సాగాల్సిన సమయమిది.

## టీచర్లకు సమస్యల స్వాగతం

### –పాడుబడ్డ పాఠశాలల్లో సమస్యల తిష్ట

హైదరాబాద్,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): సుదీర్ఘ విరామం తరువాత తలుపులు తెరవడంతో ఉపాధ్యాయులకు సమస్యలు స్వాగతం పలికాయి. పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి చెత్తాచెదారంతో నిండిపోయాయి. వరుస వర్షాలతో మైదానాలు జలమయం అయ్యాయి. మునిసిపల్ సిబ్బందితో పాఠశాలల మైదానాలు శుభ్రం చేసుకోవాలని ఆదేశాలు ఉన్నా, పుర సిబ్బంది విముఖత చూపడంతో ఉపాధ్యాయులు ఇబ్బందుల మధ్యే విధులు నిర్వర్తించాల్సి వచ్చింది. మారుమూల ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులను నిలిపేయండంతో ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురయ్యారు. ఆటోలు, సొంత వాహనాలను ఆశ్రయించారు. వర్షంలో ప్రధానంగా మహిళా ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కరోనా వ్యాప్తి ఆందోళనతో ఉపాధ్యాయులు విధులకు హాజరు కావడానికి నానా యాతన పడ్డారు. పాఠశాల తరగతి గదులతో పాటు కార్యాలయ భవనాలు సైతం పూర్తి శిథిలావస్థకు చేరాయి. మరోపక్కా వర్షాలు కురుస్తుండటంతో అవి కూలే ప్రమాదం ఉంది. ఎప్పుడు ఏమవుతుందోనని ఉపాధ్యాయులు భయాందోళనకు గురవుతున్నారు. శిథిల భవనాల్లో విధులు నిర్వహించడం ఇబ్బందిగా ఉంది. తొలిరోజు వీరికి పాఠశాలలు తెరిచి పరిసరాలను శుభ్రం చేయించడంతోనే సరిపోయింది. ఐదునెలలుగా నిర్వహణ లేకపోవడంతో పాఠశాలన్నీ మురికి కూపాలను తలపించాయి. చెత్తాచెదారం పేరుకుపోయింది. వరుస వానలకు ఆవరణల్లో నీరు నిలిచి బురదమయంగా మారాయి. పాత భవనాల పరిస్థితి అయితే చెప్పనక్కర్లేదు. స్లాబులు కురిసి.. పెచ్చులూ డాయి. నీటి చెమ్మతో గోడలు పాకుడు పట్టి కనిపించాయి. దీంతో ఉపాధ్యాయులు సిబ్బంది, కూలీల సాయంతో పరిసరాలు శుభ్రం చేయించారు. కొన్నిచోట్ల ఎవరూ అందుబాటలో లేకపోవడంతో టీచర్లే శుభ్రం చేస్తూ కనిపించారు.

## జీఎస్టీలో చేరడంతో భారీగా నష్టపోయాం

### –జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో మంత్రి హరీశ్ రావు

హైదరాబాద్,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): రాష్ట్రాలు జీఎస్టీలో చేరడం వల్ల 60 నుంచి 70 శాతం ఆదాయాన్ని కోల్పోయాయి. కేంద్రం మాత్రం 31 శాతం మాత్రమే కోల్పోయింది. అందువల్ల రాష్ట్రాలకు కేంద్రం జీఎస్టీ పరిహారం చెల్లించాల్సిందేనని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో మంత్రి హరీశ్ రావు బీఆర్కే భవన్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... జీఎస్టీ పరిహారంలో సెస్ మిగిలితే కేంద్రం కన్సాలిడేటెడ్ ఫండ్‌లో జమచేసి వాడుకుంటోంది. సెస్ తగ్గినపుడు రాష్ట్రాలు అప్పులు తీసుకోవాలని సూచించడం సమంజసం కాదన్నారు. కేంద్రమే జీఎస్టీ పరిహారం చెల్లించాలన్నారు. రాష్ట్రాలు అప్పులు తీసుకుంటే రాష్ట్రానికో వడ్డీ రేటు ఉంటున్నట్లు తెలిపారు. దీనివల్ల ఎంత కాల పరిమితితో తీసుకోవాలి, ఎన్ని సంవత్సరాలు చెల్లించాలి, ఎఫ్.ఆర్. బీ.ఎం పరిమితులు వంటి సమస్యలతో పాటు చెల్లింపుల్లోను గందరగోళం తలెత్తుందన్నారు.కేంద్రమే అప్పు తీసుకుంటే వడ్డీ రేటు తగ్గుతుంది కావునా కేంద్ర ప్రభుత్వమే బాధ్యత తీసుకుని గతంలో హామీ ఇచ్చినట్లు రెండు నెలలకొసారి జీఎస్టీ పరిహారం చెల్లించాలని కోరారు. ఐజీఎస్టీకి సంబంధించి తెలంగాణ రాష్ట్రానికి రూ. 2700 కోట్లు రావాల్సి ఉంది. వెంటనే ఈ మొత్తాన్ని విడుదల చేయాలన్నారు. అత్యధికంగా జీఎస్టీ చెల్లించే ఐదు రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. అయితే అత్యంత తక్కువ పరిహారం తీసుకునే రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా ఉందన్నారు. ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రం రూ. 18 వేల 82 కోట్లు జీఎస్టీ సెస్ రూపంలో కేద్రానికి చెల్లిస్తే.. తీసుకున్నది కేవలం రూ. 3 వేల 223 కోట్లు మాత్రమేనన్నారు. సెస్ వచ్చే ఈ ఏడాది కోవిడ్ అని, జీఎస్టీ అమలు వల్ల నష్టమని విభజిస్తే తీవ్రంగా నష్టం పోతామన్నారు. కేంద్రం అనుసరించే ఈ విధానం వల్ల పకృతి వైపరిత్యాలకు గురయిన రాష్ట్రాలు, ఆర్థిక నిర్వహణ సరిగా లేని లబ్ధి చేకూర్చుతూ అభివృద్ధి దిశగా అడుగులు వేసే తెలంగాణ వంటి వాటికి నష్టంగా పరిణమిస్తుందన్నారు. 15వ ఆర్థిక సంఘం కేటాయింపుల్లో కూడా తెలంగాణకు నష్టం జరిగినట్లు మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు.

## ఉడాన్ కింద కొత్తగా 78 రూట్లు

### –ప్రకటించిన పౌరవిమానయాన శాఖ

న్యూఢిల్లీ,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): ప్రాంతీయ అనుసంధాన పథకం ఉడాన్ నాలుగో రౌండ్‌లో 78 కొత్త రూట్లకు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ గురువారం ఆమోదం తెలిపింది. ఈశాన్య భారత దేశంలో వైమానిక సేవల అనుసంధానాన్ని పటిష్టపరుస్తున్నట్లు ప్రకటించింది. గువాహటి నుంచి తేజు, రూప్సి, తేజ్‌పూర్, పసీఘాట్, మిసా, షిల్లాంగ్ రూట్లో ప్రయాణాలకు అనుమతిస్తున్నట్లు తెలిపింది. హిసార్ నుంచి చండీగఢ్, డెహ్రాడూన్, ధర్మశాలకు ప్రయాణించవచ్చునని పేర్కొంది. వారణాసి నుంచి చిత్రకూట్, శ్రావస్తి రూట్లకు కూడా అనుమతి ఇచ్చినట్లు తెలిపింది. లక్షద్వీప్‌లోని అగట్టి, కవరట్టి, మినికోయ్ దీవులకు కూడా విమానాలు నడిపేందుకు అనుమతి ఇచ్చినట్లు పేర్కొంది. ఉడాన్ స్కీమ్‌లో ఇప్పటి వరకు 766 రూట్లకు అనుమతులు మంజూరయ్యాయి. ఉడాన్ నాలుగో రౌండ్‌ను 2019 డిసెంబరులో ప్రారంభించారు. ఈశాన్య రాష్ట్రాలు కొండ ప్రాంతాల్లోని రాష్ట్రాలు, ద్వీపాలపై ప్రత్యేక దృష్టి సారించారు. విమాన ప్రయాణాలను సామాన్యులకు చేరువ చేసేందుకు ప్రాంతీయ అనుసంధాన పథకం (ఆర్‌సీఎస్)ను 2016 అక్టోబరు 10న పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ప్రారంభించింది. మొదటి ఆర్‌సీఎస్–ఉడాన్ విమానాన్ని 2017 ఏప్రిల్ 27న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సిమ్లాలో ప్రారంభించారు.

## పబ్లిక్ టాయ్‌లెట్ల నిర్మాణం

ఖమ్మం,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): ఖమ్మం త్రీటౌన్ లోని డాబాల బజార్, రోటరీ నగర్ లో నిర్మించిన మోడ్రన్ టాయిలెట్స్ ను రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ప్రారంభించారు. స్వచ్ఛ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సూచనల మేరకు ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించారు. వీటిని మంత్రి గురువారం ప్రారంభించారు. అలాగే ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో వీధి వ్యాపారులకోసం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బస్టాండ్ ఎదురుగా రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన రైతు బజార్ ను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# రెసిడెన్షియల్ పాఠశాలలపై స్పష్టత కరవు

### క్రీడల నిర్వహణకు అవకాశాలు లేనట్లే

హైదరాబాద్,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఉపాధ్యాయలంతా బడిబాట పట్టారు. గ్రామ స్థాయిలో వెనుకబడిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వేదికలు ఏర్పాటు చేస్తూ విద్యార్థులందరికీ చేరువ అయ్యేలా ప్రణాళికలు రూపొందించాలి. ఈ –లర్నింగ్ పద్ధతుల్లో ఇంటర్నెట్, స్మార్ట్ ఫోనులు, ల్యాప్ టాప్‌లు, కంప్యూటర్లు, తదితర సౌకర్యాలపై విద్యార్థులను వర్గీకరించాలి. ఆయా సౌకర్యాలు లేని విద్యార్థుల విషయంలో హెచ్ఎంలు పంచాయతీ, ఇతర స్థానిక ప్రభుత్వ సంస్థ మద్దతులో కోవిడ్ నిబంధనలు పాటిస్తూ విద్యావనరులు అందజేయాల్సి ఉంటుంది. అలాగే స్థానికంగా అందుబాటులో ఉన్న విద్యావంతులైన యువతను గుర్తించి, వారి సేవలను వినియోగించుకోవడం ద్వారా డిజిటల్ తరగతులను విజయవంతం చేయాల్సి ఉంటుంది. సెప్టెంబరులో పాఠశాలలు ప్రారంభించినా రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారనుంది. కరోనా లాక్‌డౌన్ ఎత్తివేసినప్పటికీ ప్రజలు కొంతకాలం పాటు సామాజిక దూరం పాటించాల్సిన అవసరం ఉంటుంది. ఈ క్రమంలో రెసిడెన్షియల్ పాఠశాలల నిర్వహణ కష్టసాధ్యం కానుంది. విద్యార్థుల మధ్య భౌతిక దూరం పాటించాల్సి రావడంతో అసలు రెసిడెన్షియల్ పాఠశాలల నిర్వహణ ఎలా సాధ్యమనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అన్ని జిల్లాల్లో కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో బాలబాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. వీటికి తోడు జిల్లాలోని అధిక శాతం ప్రైవేటు స్కూళ్లకు అనుబంధంగా హాస్టళ్లు నడుస్తున్నాయి. మారుమూల ప్రాంతాలకు చెందిన విద్యార్థులు జిల్లా కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్నారు. ఈ క్రమంలో రెసిడెన్షియల్ పాఠశాలల నిర్వహణపై నీలినీడలు అలుముకోగా వాటిపై ఆధారపడ్డ విద్యార్థుల భవితవ్యం అంధకారం అయ్యే ప్రమాదం ఉంది. కరోనా నేపథ్యంలో పాఠశాలల్లో క్రీడలకు స్వస్తి పలికే అవకాశాలు కనిపిస్తున్నాయి. పాఠశాలల్లో భౌతిక దూరం పాటించడం ద్వారా వైరస్ విజృంభించకుండా చర్యలు తీసుకొనే పక్షంలో క్రీడలకు విద్యార్థులు దూరం కానున్నట్లు తెలుస్తోంది. క్రీడలు, ఇతర పోటీలు నిర్వహించే పక్షంలో విద్యార్థులు గుమిగూడే ప్రమాదం ఉండటంతో ఈ విద్యా సంవత్సరం ఆయా విభాగాలకు స్వస్తి పలికే ఆలోచనలో విద్యాశాఖ ఉన్నట్లు సమాచారం. అలాగే పాఠశాలల్లో నిర్వహించే వార్షికోత్సవాలు, అసెంబ్లీ, తదితర కార్యక్రమాలు సైతం రద్దు చేసే అవకాశాలున్నాయి. ఆన్‌లైన్ బోధన, సమయపాలన, గ్రామాల్లో విద్యుత్, ఇంటర్‌నెట్ వంటి సమస్యలు ఉపాధ్యాయులకు మున్ముందు సవాలుగా మారనున్నాయి.

# ఆన్‌లైన్ బోధనపై ఉపాధ్యాయుల్లో అయోమయం

### విద్యుత్ కోతలు, టీవీల కొరత, కేబుల్,సెల్‌ఫోన్ సమస్యలు ఆచరణలో ఏమేరకు సాధ్యం అన్న అనుమానాలు

హైదరాబాద్,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): ఆన్‌లైన్ బోధనపై ఉపాధ్యాయులు అయోమయంలో ఉన్నారు. గ్రామాల్లో విద్యుత్ కోతలు, టీవీల కొరత, టీవీ కేబుల్, సెల్‌ఫోన్ వంటివి అందుబాటులో లేని వారికి ఎలా విద్యాబోధన అందించాలన్న ఆందోళన ఉంది. పంచాయతీ కార్యాలయంలో టీవీ పాఠాలు వినేలా చేయడం వంటి పనులు ఆచరణలో ఏమేరకు సాధ్యం అన్న అనుమానాలు వెంటాడుతున్నాయి. వర్క్‌షీట్‌లు ఆన్‌లైన్‌లోనే పంపి క్లాసులు వింటున్నారా, ఇచ్చిన వాటిని పూర్తి చేస్తున్నారా అనేది పర్యవేక్షించడం ఎలా అనే సందేహాలు ఉన్నాయి. పిల్లలు లేకుండా రెండు పూటలా ఎదురుచూస్తూ కూర్చోవడం ఎలా అన్న ప్రశ్న ఉపాధ్యాయుల్లో ఉంది. విద్యాశాఖ ఆదేశాలతో తెలంగాణ వ్యాప్తంగా ఎట్టకేలకు మొక్కుబడిగా విద్యా సంవత్సరం ఆరంభమైంది. గురువారం జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు పాఠశాలలకు చేరుకున్నారు. ఆన్‌లైన్ బోధనకు అనుగుణంగా విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించేందుకు కసరత్తు ప్రారంభించారు. అనేక పాఠశాలల్లో శానిటైజేషన్ మాత్రం చేయగలిగారు. ఈ క్రమంలో విధుల్లో చేరిన సిబ్బంది తమ పాఠశాల పరిధిలోని విద్యార్థులకు మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, టీవీ సెట్లు వంటి ఉపకరణాలు అందుబాటులో ఉన్నాయా లేవా అన్న సమాచారాన్ని సేకరించే పనిలో పడ్డారు. ఆర్టీసీ బస్సు సర్వీసులు నడుపుతుండటంతో ఉపాధ్యాయులు రవాణా పరమైన సమస్యలను ఎదుర్కొన లేదని సమాచారం. చాలా మంది ఉపాధ్యాయులు తమ సొంత వాహనాలపైనే పాఠశాలలకు చేరుకున్నారు. జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఇప్పటికే సంబంధిత సర్పంచులకు ఆదేశాలు జారీచేయడంతో సోడియం హైపోక్లోరైడ్ ద్రావణంతో పాఠశాలల భవనాలను శానిటైజ్ చేశారు. పట్టణ, గ్రామీణ పాఠశాలల్లో మున్సిపల్, పంచాయతీ పారిశుధ్య సిబ్బంది పాఠశాలలను శుభ్రం చేశారు. కొన్నిచోట్ల మొదటి రోజు పాఠశాలలను శుభ్రం చేసుకునే పనితోనే వారికి సరిపోయింది. అయితే ప్రస్తుతం పాఠశాలల్లో విద్యావాలంటీర్ల అవసరం లేకపోవడంతో వారిని పక్కనపెట్టారు. ఒకటో తేదీ నుంచి ఆన్‌లైన్ బోధన ప్రారంభిస్తున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని జిల్లా విద్యాధికారి కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపోతే కరోనా నిర్ధారణ కోసం ఏ పాఠశాలలోనూ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. అలాగే పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సంబంధించి ఎలాంటి ఆన్‌లైన్ సదుపాయాలు అందుబాటు లో ఉన్నాయనే సమాచారాన్ని సేకరించి అందుకు తగ్గట్లుగా వర్గీకరణ చేపట్టారు. మరోవైపు గ్రామపంచాయతీల్లో అందుబాటులో ఉన్న టీవీ సెట్ ద్వారా డీడీ, టీశాట్ ద్వారా బోధన అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇకపోతే కొన్నిచోట్ల ఉపాధ్యాయులకు కరోనా సోకడంతో అలాంటి వారు విధులకు హాజరు కాలేదు. కరోనా బారిన పడటం, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉన్నవారు తప్ప తొలిరోజు పాఠశాలలకు 99శాతం మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. అంతంత మాత్రం సౌకర్యాలు, రక్షణ ఉండే ప్రభుత్వ పాఠశాలు ఐదు నెలల అనంతరం సమస్యలతో స్వాగతం పలికాయి. విద్యార్థులు ఇంటికే పరిమితం కాగా, ఓవైపు కరోనా, మరో వైపు రవాణా తిప్పలు, ఇంకోవైపు వర్షం నడుమ ఉపాధ్యాయులు బడిబాట పట్టారు. విద్యావలంటీర్లపై ఆధారపడిన పాఠశాలలు మూతపడగా, క్వారంటైన్ కేంద్రాలుగా ఉన్న పాఠశాలల ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు. ఇదిలా ఉండగా, టీ–సాట్, దూరదర్శన్ యా దగిరిఛానల్ ద్వారా ఆన్‌లైన్ విద్యాబోధనకు ఆయా గ్రామాల్లో సదుపాయాలు, విద్యార్థులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలపై ఉపాధ్యాయులు తొలిరోజు అధ్యయనం ప్రారంభించారు.

# విద్యార్థులకు సైకిళ్లు అందచేత

### అభివృద్ధిలో మనమే టాప్ అన్న కొప్పుల

జగిత్యాల,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఇచ్చిన మాటను నిలుపుకున్నారు. పెగడపల్లి మండలం ఎల్లాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థులు మోదంపల్లి సిద్ధార్థ, గౌతమ్ అన్నదమ్ములు. ఇద్దరు సైకిల్ కొనుగోలు కోసం దాచుకున్న రూ.2500 కరోనా వైరస్ పోరాడేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధికి కోసం మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారికి మంత్రి ఎల్ఎం కొప్పుల చారిటబుల్ ట్రస్టు ద్వారా ఇద్దరు పిల్లలకు సైకిల్ కొనిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు గురువారం ఎల్లాపూర్ గ్రామంలో పర్యటించగా, ఇద్దరు అన్నదమ్ముళ్లకు సైకిళ్లు కొని ఇచ్చారు.

టీఆర్ఎస్ పాలనలోనే తెలంగాణ సమగ్రాభివృద్ధి జరిగిందని కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. పెగడిపల్లి మండలం ఎల్లాపూర్, కీచులాటలపల్లి, రాజారామ్ పల్లి గ్రామాల్లో రూ. కోటి 12 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి మాట్లాడారు. సమైక్య రాష్ట్రంలో 60 ఏండ్లలో జరగని అభివృద్ధి ప్రత్యేక రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కేవలం కేవలం 6 ఏండ్లలో చేసి చూపారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో ముందుంచుతున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి స్థానికులు చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కాసుగంటి రాజేందర్‌రావు, ఎంపీపీ గోలి శోభాసురేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ గంగాధర్, సింగిల్ విండో చైర్మన్లు మంత్రి వేణుగోపాల్, కర్ర భాస్కర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ తిరుపతి నాయక్, వైస్ ఛైర్మన్ రమణ, స్థానిక టీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం ఎల్లాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థులు మోదంపల్లి సిద్ధార్థ, గౌతమ్‌లకు కొప్పుల ట్రస్ట్ ద్వారా సైకిళ్లు అందచేసిన మంత్రి కొప్పుల ఈశ్వర్

## రైతుబీమాకు 5 వరకు గడువు

జనగామ,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): రైతుబీమా దరఖాస్తు గడువు సెప్టెంబర్ 5వ తేదీ వరకు ఉన్నదని వ్యవసాయాధికారిఅన్నారు. వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతూ తప్పనిసరిగా రైతుబీమా చేయించుకోవాలన్నారు. గతంలో దరఖాస్తు చేసుకోని రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలను ఏఈవోలకు అందజేయాలన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని రైతులు వినియోగించుకోవాలన్నారు. జిల్లాలోని రైతులు అవసరం మేర యూరియాను వాడి అధిక దిగుబడి సాధించాలని తెలిపారు. రైతాంగం సిఫారసు చేసిన మోతాదుకన్నా ఎక్కువ యూరియాను వాడుతూ నష్టపోతున్నారని పేర్కొన్నారు. యూరియా వేసేటప్పుడు తేమ ఉండేలా చూడాలని, యూరియా వేప పిండి కలిపి వేసుకుంటే నత్రజని సామర్థ్యం పెరుగుతుందని అన్నారు. అలాగే చీడపీడలను అరికడు తుందని అన్నారు. చివరగా అధికమోతాదులో వేసే యూరియా చీడపీడలను ఆకర్షిస్తుందని తద్వారా పంటలు నష్టపోవాల్సి వస్తుందని అన్నారు.

## ఏకాంతంగానే సాలకట్ల బ్రహ్మోత్సవాలు

### మాడవీధుల్లో వాహన సేవలకు విరామం
### కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఆలయాల నిర్మాణం
### వేద పాఠశాలలు అన్ని ఒకే గొడుగు కిందకు
### 5.5 కోట్లతో బర్డ్ హస్పిటల్స్ 50 గదులు నిర్మాణం
### –టిటిడి పాలకమండలి కీలక నిర్ణయాలు

తిరుమల,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): సెప్టెంబరు 19 నుంచి నిర్వహించవలసిన సాలకట్ల బ్రహ్మోత్సవాలను ఏకాంతంగానే నిర్వహిస్తామని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. అక్టోబర్ 16 నుంచి నిర్వహించ వలసిన నవరాత్రి బ్రహ్మోత్సవాలు అప్పటి పరిస్థితులు బట్టి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ధర్మ ప్రచారంలో భాగంగా కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఆలయాలు నిర్మిస్తామని ఆయన పేర్కొన్నారు. ముంబాయిలో త్వరలోనే ఆలయ నిర్మాణంకు శంకుస్థాపన చేస్తామని అన్నారు. వారణాసి, భువనేశ్వర్ లో ఆలయాలు నిర్మిస్తామని పేర్కొన్నారు. టిటిడి తీసుకున్న నిర్ణయాలను ఆయన మీడియాకు వివరించారు. విశాఖపట్నంలో ఆలయ నిర్మాణం పూర్తి అవుతుందని చెప్పారు. జమ్ములో స్థల పరిశీలన పూర్తి అయ్యింది... త్వరలోనే ఆలయ నిర్మాణం పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఆలయాల నిర్మాణానికి ఆ రాష్ట్రంలోని భక్తులు నుంచి విరాళాలు సేకరిస్తామన్నారు. ఆదాయ వనరులు పెంచుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కోవిడ్ కారణంగా వడ్డి ద్వారా వచ్చే ఆదాయం తగ్గుముఖం పట్టిందని చెప్పుకొచ్చారు. 5.5 కోట్లుతో బర్డ్ హస్పిటల్స్ 50 గదులు నిర్మాణం చేపడతామని అన్నారు. బర్డ్ ప్రాంగణంలో చిన్న పిల్లలు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ని ప్రారంభిస్తామని సుబ్బారెడ్డి అన్నారు. 4.95 కోట్లతో వైజాగ్ లో శ్రీవారి ఆలయాని నిర్మిస్తున్న ప్రాంతంలో ఘాట్ రోడ్డు నిర్మాణంకు కేటాయించామని చెప్పారు. టీటీడీ ఆధ్వర్యంలోని వేద పాఠశాలలు అన్ని ఒకే గొడుగు క్రిందకి తీసుకు వస్తామని ఆయన స్పష్టం చేసారు. టీటీడీ ఉద్యోగులను వైయస్సార్ ఆరోగ్య శ్రీ పథకం పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వాని కోరుతామని అన్నారు. అదే విధంగా కోవిడ్ బారిన పడ్డ ఉద్యోగులకు అయిన వైద్య ఖర్చులు టీటీడీనే భరిస్తుందని చెప్పారు. ఉదయాస్తమాన సేవ టిక్కెట్లను కలిగిన భక్తులను బ్రేక్ దర్శనాలకు అనుమతిస్తామని అన్నారు. శాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ సిస్టమ్ విధానం పరిశిలనకు కమిటి ఏర్పాటు చేస్తామని, కోటి రూపాయలు విరాళాన్ని సుధానారాయణ మూర్తి అందించారని అన్నారు. గో సంరక్షణ కోసం... ప్రతి ఆలయానికి గోమాత కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు.ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో 214 గదుల వసతి గృహ నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థాన పాలకమండలి నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో విడతల వారిగా హాస్టల్ నిర్మాణం చేపట్టాలని బోర్డు సూచించింది. టీటీడీ బంగారు నగలు, డిపాజిట్లతోపాటు పలు విషయాలపై పాలకమండలి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షార్ట్ టర్మ్ డిపాజిట్ చేయడం వల్ల తక్కువ వడ్డీ వస్తుందని, లాంగ్ టర్మ్ డిపాజిట్ చేస్తే ఎక్కువ వడ్డీ వస్తుందన్న సభ్యులు తెలిపారు. అలాగే హుండీ ద్వారా రద్దయిన నోట్లు వస్తున్నాయని, ఇప్పటి వరకు రూ.50 కోట్లు పాత నోట్లు వచ్చినట్లు తెలిపారు. ఈ విషయంపై రిజర్వు బ్యాంకుకు అనేకసార్లు లేఖ రాసినట్లు పాలకమండలి సభ్యులు వెల్లడించారు. మరోసారి కేంద్రం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. బంగారు డిపాజిట్ పై చర్చించిన పాలకమండలి వాటిని 12 సంవత్సరాలు లాంగ్ టర్మ్ డిపాజిట్ చెయ్యాలని నిర్ణయించారు. పాలకమండలి సభ్యుడు పార్థసారథి అభ్యర్థన మేరకు విజయవాడ, పోరంకిలో కళ్యాణ మండపం నిర్మాణానికి ఆమోదం తెలిపారు. అలాగే తిరుమలలో పేరుకుపోయిన వ్యర్థాలపై చర్చించారు. తిరుమలలో పెరుకుపోయినట్లు 7 టన్నులు వ్యర్థాలను తరలించడానికి టీటీడీ బోర్డు సభ్యురాలు సుధా నారాయణమూర్తి ఆర్థిక విరాళం అందించారు. వీటితోపాటు టీటీడీ ఎలక్ట్రికల్ విభాగంలో పని చేస్తున్న 53 కార్మికుల కాంట్రాక్టు మరో రెండు సంవత్సరాల పెంపుకు ఆమోదం తెలిపింది. సింగరాయకొండ ఆలయం ప్రాంగణంలో టీటీడీ కళ్యాణమండపం నిర్మాణానికి పాలక మండలి ఆమోదం తెలిపింది. ఇకపోతే శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఏకాంతంగా నిర్వహించాలని నిర్ణయించారు. అధిక మాసం సందర్భంగా ఈఏడాది రెండు బ్రహ్మోత్సవాలు రానున్నాయి. సెప్టెంబర్ 19 నుంచి 28 వరకు బ్రహ్మోత్సవాలు ఏకాంతంగా నిర్వహించా లని నిర్ణయించారు. కరోనా ఉధృతి తగ్గితే అక్టోబర్‌లో బ్రహ్మోత్సవాలు వెలుపల నిర్వహించనున్నారు.

## తగ్గుతున్న బంగారం ధరలు

### –కరోనా వ్యాక్సిన్ ప్రకటనతో మార్పు

ముంబై,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి కారణంగా రెండు వారాల క్రితం వరకు భారీగా పెరుగుతూ వచ్చిన బంగారం ధరలు, రష్యా వ్యాక్సిన్ వచ్చిన తర్వాత తగ్గుముఖం పట్టాయి. అయితే పసిడి ధరలు ఏడు రోజుల్లో... ఆరు రోజుల పాటు క్షీణించాయి. వెండి ధరలు కూడా స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. అంతకుముందు సెషన్‌లో వారంలో తొలిసారి లాభపడ్డ పసిడి, దానిని కొనసాగించలేకపోయింది. ఈరోజు ప్రారంభ ట్రేడింగ్‌లో తగ్గుముఖం పట్టింది. మల్టీ కమోడిటీ ఎక్స్చేంజ్(ఎంసీఎక్స్) అక్టోబర్ గోల్డ్ ఫ్యూచర్స్ 0.22 శాతం క్షీణించి 10 గ్రాములు రూ.51,665 పలికింది. నిన్న ఉదయం ప్రారంభంలో 0.4 శాతం ఎగిసిన ధరలు ఆ తర్వాత మరింతగా పెరిగాయి. వరుసగా ఐదు రోజుల పాటు తగ్గిన ధరలు నిన్న ఒక్కరోజు దాదాపు రూ.900 ఎగిసింది. వెండి ధర ఏకంగా రూ.3500 పెరిగింది. గురువారం మాత్రం ప్రారంభ సెషన్‌లో పసిడి 0.22 శాతం తగ్గింది. వెండి కిలో 1 శాతం పడిపోయి రూ.66,821 పలికింది. బులియన్ మార్కెట్లో పసిడి ధర తగ్గింది. గురువారం హైదరాబాద్‌లో 10 గ్రాముల పసిడి ధర 24 క్యారెట్లు రూ.400 వరకు పడిపోయి రూ.53,660కి చేరుకుంది. ఓ సమయంలో రూ.59వేల మార్క్ సమీపానికి చేరుకున్న ధరలు ఇప్పుడు దాదాపు 5,500 వరకు తక్కువ పలుకుతోంది. 22 క్యారెట్ల పసిడి రూ.300 వరకు తగ్గి రూ.49,200కు చేరుకుంది. వెండి కిలో ధర స్వల్పంగా పెరిగి రూ.65,550 పలికింది. పరిశ్రమ యూనిట్లు, నాణెలిల తయారీదారుల నుండి డిమాండ్ పుంజుకోవడం ఇందుకు ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు.

## ఇళ్లస్థలాల సేకరణలో అవినీతి: సోము వీర్రాజు

న్యూఢిల్లీ,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): పేదలకు ఇళ్ల స్థలాల పేరుతో వైసీపీ కూడా అవినీతికి పాల్పడిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు ఆరోపించారు. దానిపై సీబీఐ విచారణకు కోర్టు కూడా ఆదేశించిందన్నారు. కర్నూలులో హైకోర్టు పెట్టాలన్నది తమ డిమాండ్ అని, రాష్ట్ర రాజధాని అంశంపై తమ వైఖరిలో మార్పు లేదని సోము వీర్రాజు స్పష్టం చేశారు. వీర్రాజు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో సమావేశం అయ్యారు. వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అంశాలపై కేంద్రమంత్రితో చర్చించామన్నారు. పెండింగ్ అంశాలను జగన్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. డ్రిప్ ఇరిగేషన్, గృహ నిర్మాణం అంశాల్లో సీఎం చొరవ తీసుకోవడం లేదన్నారు.

# లైంగిక వేధింపులకు పాల్పడ్డ వ్యక్తిపై దిశ ఎందుకు పెట్టరు

### హత్యాయత్నం చేస్తే వెనకేసుకొస్తారా?

### భీమిలి ఘటనపై మండిపడ్డ పవన్ కళ్యాణ్

అమరావతి,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): ప్రజాగళం వినిపిస్తూ, బాధితులకు బాసటగా నిలబడటమే జనసేన విధానమని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. ఆ విధంగా పని చేస్తున్న జనసేన శ్రేణులపై అధికారపక్షం దాడులకు తెగబడుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం అప్రజాస్వామిక మని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ విశాఖపట్నం జిల్లా భీమిలి నియోజకవర్గంలోని నిడిగట్టు పంచాయతీ నేరెళ్ళవలసకు చెందిన జనసేన కార్యకర్త మూగి ప్రసాద్, బీజేపీ కార్యకర్త మూగి శ్రీనివాస్‌లపై వైసీపీ నాయకుడు ఊళ్ళ చిన్నా హత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. బాధితులు తీవ్ర గాయాలతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. జనసేన నాయకులు ఆ ఇద్దరి పరిస్థితిని తన దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. ఈ ఘటన విషయంలో భీమిలి పోలీసులు అనుసరిస్తున్న విధానం, కేసులు నమోదు చేసిన తీరు అన్యాయంగా ఉందని వ్యాఖ్యానించారు. హత్య చేసేందుకు ప్రయత్నించిన అధికారపక్ష నేతను అరెస్ట్ చేయకుండా, బాధితుల పక్షాన నిలిచినవారిని రాత్రికిరాత్రి అరెస్ట్ చేయడం పలు అనుమానాలకు తావిస్తోందని పవన్ అన్నారు. ఆ ప్రాంతం వాలంటీర్‌గా పని చేస్తున్న వివాహితపై అధికార వైసీపీ నాయకుడు లైంగిక వేధింపులకు పాల్పడితే మందలించారని సమాచారం ఉందన్నారు. వాలంటీర్‌పై లైంగిక వేధింపులకు పాల్పడ్డ వ్యక్తిపై నిర్భయ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలను కాపాడతామని వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన దిశ చట్టం ఏమైందని ప్రశ్నించారు. నడిరోడ్డుపై హత్యాయత్నానికి పాల్పడ్డ వ్యక్తిని అరెస్ట్ చేయకుండా ఉండటం వెనక ఎవరి ఒత్తిళ్ళు ఉన్నాయో భీమిలి ప్రాంత ప్రజలకు అర్థం అవుతోందని తెలిపారు. పోలీసులు చట్టానికి బద్ధులై విధులు నిర్వర్తిస్తూ, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని.. అందుకు భిన్నంగా అధికార పక్షం కోసమే పని చేస్తామంటే న్యాయస్థానాల ద్వారా చట్టాన్ని పరిరక్షించుకుంటామని స్పష్టం చేశారు. కొద్ది వారాల కిందటే విజయనగరంలో బీజేపీ నాయకుడిపై అధికారపక్ష గూండాలు హత్యాయత్నానికి తెగబడ్డారని మండిపడ్డారు. ఇప్పుడు భీమిలి నియోజకవర్గం పరిధిలో జనసేన, బీజేపీ కార్యకర్తలపై హత్యాయత్నానికి దిగారన్నారు. రాష్ట్ర డీజీపీ తక్షణం స్పందించి నిందితుడిని తక్షణమే అరెస్ట్ చేసి లైంగిక వేధింపులకు పాల్పడ్డ ఘటన, హత్యాయత్నంపై కేసులు నమోదు చేయాలని పవన్ కళ్యాణ్ డిమాండ్ చేశారు.

# కరోనా కట్టడిలో ప్రభుత్వాలు విఫలం

### ప్రజల అటెన్షన్ తప్పించేందుకే నీట్ పరీక్షలు

### నిరసన కార్యక్రమంలో పిసిసి చీఫ్ శైలజానాథ్

అనంతపురం,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): కరోనా కట్టడిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయనిఏపీసీసీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ విమర్శించారు. ప్రజల అటెన్షన్‌ను డైవర్ట్ చేసేందుకే నీట్, జేఈఈ పరీక్షలు అని... రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న దాంట్లో హేతుబద్ధత లేదని అన్నారు. కరోనా నేపథ్యంలో నీట్, జేఈఈ పరీక్షలు రద్దు చేయాలంటూ ఆర్డీవో కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ నిరసనకు దిగింది. పీసీసీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తును వాడుకోవద్దని హెచ్చరించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కరోనా అంటే మెదటి నుంచి తేలిక భావమని మండిపడ్డారు. రాష్ట్రంలో వైన్ షాపుల ఓపెన్ చేయడం వల్లే సగం కేసులు పెరిగి... రికార్డు స్థాయిలో కరోనా కేసులు నమోదవుతున్నాయని ఆయన విమర్శించారు. 1500 బెడ్లతో కోవిడ్ కేర్ సెంటర్ అనంతపురంలో జిల్లాలో ఎక్కడా లేదన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ఎంపీ విజయసాయిరెడ్డి ఆసుపత్రులకు వచ్చి సమీక్షించాలని డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లాలో పరిస్థితులు ఎలా ఉన్నాయో సాక్షాత్తూ అధికార పార్టీ ఎమ్మెల్యేలే చెబుతున్నారని శైలజానాథ్ తెలిపారు.

# కిట్ల అక్రమాలపై అధికారుల సీరియస్

### -ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్ల అరెస్ట్

శ్రీకాకుళం,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): కరోనా పరీక్షలకు సంబంధించి ర్యాపిడ్ కిట్ల విక్రయ వ్యవహారంలో ముగ్గురు ల్యాబ్ టెక్నీషియన్లపై సస్పెన్షన్ వేటు పడింది. కరోనా నిర్ధారణ పరీక్షల కిట్లను విక్రయిస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని.. దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి నిందితులపై కఠినచర్యలు తీసుకుంటామని జేసీ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వమే కిట్లను సమకూర్చుతోందని.. అయితే కొందరు రూ.2 వేలకు కిట్లు విక్రయిస్తున్నట్టు ఫిర్యాదులు రాగా, విచారణకు ఆదేశించామని తెలిపారు.విధి నిర్వహణలో అలసత్వం వహించినా.. అక్రమాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ క్రమంలో పలాస సామాజిక ఆస్పత్రి లో ల్యాబ్ టెక్నీషియన్లు గిన్ని నారాయణ, శ్యామ్‌కుమార్, పలాస ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రం ల్యాబ్ టెక్నీషియన్ గునితి వెంకటరమణలు కొవిడ్-19 ర్యాపిడ్ కిట్లను రూ.2 వేలు చొప్పున విక్రయిస్తు న్నట్టు విచారణలో తేలిందని చెప్పారు. కలెక్టర్ నివాస్ ఆదేశాల మేరకు ఈ ముగ్గురు ల్యాబ్ టెక్నీషియన్లను సస్పెండ్ చేశామని, వారిపై క్రిమి నల్ కేసులకు ఆదేశించామని స్పష్టం చేశారు. యంత్రాం గం కొవిడ్ విధుల్లో నిబద్ధతతో వ్యవహరిస్తోందని.. ఇటువంటి సమయంలో చెడ్డపేరు తీసుకురావద్దని విజ్ఞప్తి చేశారు.

# జెఇఇ,నీట్ పరీక్షల రద్దుకు కాంగ్రెస్ డిమాండ్

### -దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు

న్యూఢిల్లీ,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): జేఈఈ, నీట్ పరీక్షలను సెప్టెంబర్‌లో నిర్వహించరాదు అంటూ కాంగ్రెస్ పార్టీ ఇవాళ దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్నది. ఢిల్లీలోని శాస్త్రీ భవన్ వద్ద ఆ పార్టీ కార్యకర్తలు భారీ ఆందోళన చేపట్టారు. చెన్నైలో కూడా కాంగ్రెస్ పార్టీ వర్కర్లు.. జేఈఈ, నీట్ పరీక్షలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. కోవిడ్ వేళ ప్రవేశపరీక్షలు వద్దు అంటూ ఆందోళన చేశారు. కర్నాటకలోనూ నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా కార్యకర్తలు ధర్నాలో పాల్గొన్నారు. బెంగుళూరులోని రేస్ కోర్సు రోడ్డుపై నిరసన ప్రదర్శన చేపట్టారు. అహ్మదాబాద్‌లో ఎన్ఎస్‌యూఐ సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. జేఈఈ, నీట్ పరీక్షలను సెప్టెంబర్‌లో నిర్వహించరాదు అని విద్యార్థి నాయకులు ఆందోళన చేపట్టారు.

# గోదాం నిర్మాణ పనులకు శంకుస్థాపన

### -నాబార్డు ద్వారా ఇరు రాష్ట్రాలకు సాయం: ఛైర్మన్

రంగారెడ్డి,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): నాబార్డు నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లకు 60 నుంచి 70వేల కోట్లు ఇవ్వలనుకున్నామని నాబార్డ్ చైర్మన్ చింతల గోవింద రాజులు తెలిపారు. జిల్లాలోని ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధి సీతారాంపేట గ్రామ సమీపంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో గోదాం నిర్మాణ పనులకు మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రైతులపై చాలా ప్రేముందన్నారు. తాను నాబార్డ్ చైర్మన్‌గా ఎన్నికై మన రాష్ట్రం, మన ప్రాంతానికి రావటం చాలా సంతోషంగా ఉందన్నారు. రైతుల ముఖాల్లో చిరునవ్వు చూడాలనుకుం టున్నాని తెలిపారు. రాష్ట్రంలో బ్యాంక్ లను మోడల్ బ్యాంక్ లుగా మార్చాలని పేర్కొన్నారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో రైతులు ఎక్కువ వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తారు. వారికి అండగా నిలువాల్సిన అవసరం ఉందని తెలిపారు. నిరుపేదలను ఆదుకున్నప్పుడే దేశం ముందు వెళ్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# దక్షిణామూర్తికి మంత్రి నివాళి

నిర్మల్,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): అడిషనల్ ఎస్పీ దక్షిణామూర్తికి మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి నివాళులర్పించారు. మామడ మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పోలీసులతో కలిసి రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..విధి నిర్వహణలో దక్షిణామూర్తి అంకిత భావంతో పని చేశారన్నారు. ముఖ్యంగా మేడారం జాతర విధుల్లో తన ప్రత్యేకతను చాటుకున్నారని ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. కరోనాతో దక్షిణామూర్తి చనిపోవడం బాధాకరమన్నారు.

# కోర్టు ఆదేశాలకు భిన్నంగా వ్యవహారాలు

### విశాఖ విషయంలో వెనక్కి తగ్గని సర్కార్

### విమర్శలకు జడవని విధంగా నిర్ణయాలు

అమరావతి,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): మూడు రాజధానుల వ్యవహారంలో కోర్టుల్లో ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఎపి ప్రభుత్వం వెనక్కి తగ్గడం లేదు. అమరావతిని చంద్రబాబు రియల్ ఎస్టేట్ వెంచర్‌గా అభివర్ణిస్తూ దానిని రద్దు చేయడమే లక్ష్యంగా జగన్ ప్రభుత్వం కంకణం కట్టుకుంది. మరోవైపు అమరావతే కావాలంటూ రాజధాని గ్రామాల రైతుల, మహిళలు చేపట్టిన నిరసనలు కొనసాగుతున్నాయి. మందడం, తుళ్లూరు, వెలగపూడి, పెదపరిమి, వెంకటపాలెం, బోరుపాలెం, అబ్బురాజు పాలెం, ఉద్దండరాయుని పాలెం తదితర గ్రామాల్లోని శిబిరాల్లో రైతుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. రాజధానిగా అమరావతి కొనసాగుతుందని ప్రభుత్వం చెప్పే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని రాజధాని రైతులు స్పష్టం చేస్తున్నారు. కరోనా సూచనలు పాటిస్తూ అమరావతి ఉద్యమం సాగుతోంది. అయినా సర్కార్‌లో కించిత్ చలనం కూడా సాగడం లేదు. నిజానికి ప్రభుత్వ వాదన వింతగా ఉంది. మూడు రాజధానుల ప్రకటనపై అంతా ముక్కున వేలేసు కుంటున్నారు. ఈ క్రమంలో ఏపీ ప్రభుత్వనికి హైకోర్టులో ఎదురు దెబ్బలు తగులుతూనే ఉన్నాయి. గురువారం ఒక్కరోజే మూడునాలుగు కేసుల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా హైకోర్టు కామెంట్ చేసిన పరిస్థితి ఏర్పడింది. సుప్రీం కోర్టు కూడా అమరావతి వ్యవహారాన్ని హైకోర్టులలోనే తేల్చుకోవాలని సూచించింది. ప్రధానంగా రాజధాని తరలింపుకు సంబంధించి సీఆర్డీఏ బిల్లులకు సంబంధించి రాజధాని రైతులు, అమరావతి పరిరక్షణ సమితి వేసిన పిటిషన్లపైన స్టేటస్‌కోను 21 వరకు పొడిగిస్తూ హైకోర్టు తీర్పు చెప్పింది. అలాగే 21వరకు కొత్తగా విశాఖలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని హైకోర్టు తెలిపింది. అయితే గతంలో సుప్రీంకోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా కూడా వ్యవహరించిన ప్రభుత్వం...హైకోర్టు ఆదేశాలకు భిన్నంగా విశాఖలో స్టేట్ గెస్ట్ హౌజ్‌కు స్థలం కేటాయిస్తూ జీవో విడుదల చేసింది. హైకోర్టు ఈ కామెంట్ చేసిన తర్వాత కూడా మళ్లీ ఆ స్టేట్ గెస్ట్ హౌజ్‌కు 30 ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 1353 జీవోను ప్రభుత్వం విడుదల చేసింది. అంటే ప్రభుత్వం కోర్టు తీర్పులను ఏ మాత్రం పట్టించుకోకుండా ముందుకు వెళ్లే ధోరణినే ప్రదర్శిస్తోందని ప్రభుత్వతీరుతో అర్థమవుతోంది. కానీ కోర్టులు మాత్రం ప్రభుత్వ వ్యవహార శైలిని పదే పదే తప్పుబడుతూనే ఉన్నాయి. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో చోటుచేసుకుంటున్న ఇతరత్రా పరిణామాలు కూడా దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. హైకోర్టు న్యాయమూర్తులపై రాష్ట్ర ప్రభుత్వం నిఘా పెట్టడాన్ని ఇప్పటివరకు కనలేదు వినలేదు. ప్రభుత్వం మాపై నిఘా పెట్టడం ఏమిటని న్యాయమూ ర్తులు ఆశ్చర్యపోతున్నారు. ఇప్పటివరకూ పనిచేసిన ముఖ్యమంత్రులు అందరూ న్యాయమూర్తులతో గౌరవంతో మెలిగేవారు. అయితే ఎపిలో పరిణామాలు చూస్తుంటే న్యాయవ్యవస్థతో ఘర్షణకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నదా అన్న భావన కలుగుతోంది. ఇకపోతే పేదలకు ఇంటిస్థలాల కోసం పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్న ప్రభుత్వం ఇంటి స్థలాల కొనుగోళ్లకు సంబంధించి పెద్ద ఎత్తున అవినీతి జరిగిందన్న విమర్శలపైనా పట్టించుకోవడం లేదు. అంతే కాదు ఆవభూములు ఏమాత్రం కూడా నివాసయోగ్యం కాని భూములు, అక్కడ ఇళ్లస్థలాలు ఇవ్వకూడదు అంటూ రాజకీయ పార్టీలన్నీ కూడా ఆందోళనలు చేశాయి. అంతే కాదు అక్కడ భూముల కొనుగోలుకు సంబంధించి చాలా పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు వచ్చాయి. దీనిలో పెద్ద ఎత్తున కుంభకోణం జరిగిందని, డబ్బులు పెద్దలకు అందాయంటూ చాలా ఆరోపణలు వచ్చాయి. ఇప్పటికే దాదాపు 300 ఎకరాల వరకు సేకరించారు, దానికి పెద్ద ఎత్తున డబ్బులు కూడా ఇచ్చారు. దాదాపు వంద కోట్లు చేతులు మారినట్లుగా వార్తలు వస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారంపైన సీబీఐ కూడా హైకోర్టు నోటీసులు ఇచ్చింది. ఈ వ్యవహారంలో సిబిఐ రంగంలోకి దిగితే కచ్చితంగా చాలా మంది పెద్దల పేర్లు బయటకు వస్తాయనే అంటున్నారు. ఆవ భూములు నివాసయోగ్యమైనవి కాదు అంటూ జేఎన్టీయూ కూడా రిపోర్టు ఇచ్చింది. కానీ వాటిని ఏమాత్రం కూడా పట్టించుకోకుండా ప్రభుత్వం ఇళ్ల స్థలాలు అక్కడే ఇచ్చేందుకు ముందుకు వెళ్లింది. రిపోర్టులను అన్నింటినీ ప్రభుత్వం తొక్కిపెట్టినప్పటికీ ఇటీవల వచ్చిన గోదావరి వరదలు ఆ భూములు ఏమాత్రం నివాసయోగ్యంగా ఉన్నాయి...లేదా అన్ని విషయాన్ని తేల్చేశాయి. దాదాపు ఏడు నుంచి ఎనిమిది అడుగుల మేర ఆవ భూముల్లో నీరు నిలిచిన పరిస్థితుల్లో అవి ఏమాత్రం కూడా నివాసయోగ్యం కాదనే విషయంలో స్పష్టత వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ మొత్తం వ్యవహారంపైన విచారణ జరిగితే ప్రభుత్వానికి సంబంధించిన పెద్దల పేర్లు కూడా బయటకు వస్తాయనే చర్చ జరుగుతోంది. అంతే కాదు అమరావతికి సంబంధించిన రైతులకు కౌలు ఇవ్వకుండా జాప్యం చేశారు. ఆ కౌలును కూడా హైకోర్టు ఆదేశించాక కానీ జమ చేశామని ప్రభుత్వం తెలిపింది. మొత్తంగా ఎపి వ్యవహారాలు అభివృద్ధి వైపు కన్నా అధోగతి వైపు పయనిస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. రాజ్యాంగ సంస్థలను కాదని ముందుకు సాగుతున్నారు. కోర్టులను లక్ష్య పెట్టడం లేదు. గత ముఖ్యమంత్రి చంద్రబాబు తప్పు చేశారని, ఆయన కేవలం సొంత కుల ప్రయోజనాల కోసం తపించారని, అమరావతిని రియల్ ఎస్టేట్‌గా మార్చారని పదేపదే ప్రచారం చేయడంలో వైకాపా విజయం సాధిస్తోంది. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ అంతకు మించి తప్పుచేస్తున్నారని టిడిపి, లెఫ్ట్ నేతలు ఎదురుదాడి చేస్తున్నారు. ఈ క్రమంలో మంత్రులు చేస్తున్న ప్రకటనలూ, వ్యాఖ్యలూ ఎబ్బెట్టుగా ఉంటున్నాయి. చంద్రబాబును దోషిగా నిలబెట్టడానికి అధికార పార్టీ ప్రయత్నిస్తుండగా, ముఖ్యమంత్రి జగన్ నిర్ణయం వల్ల జరగబోయే అనర్థాన్ని ప్రజలకు వివరించడానికి ప్రతిపక్షమైన తెలుగుదేశం పార్టీ ప్రయాస పడుతోంది. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు అటూ ఇటూ దరువేస్తున్నాయి. ఇక బీజేపీ, జనసేన పార్టీ కూటమి తమదైన ఆటను మొదలెట్టింది. రాజధాని ఎంపిక నిర్ణయం రాష్ట్రాల పరిధిలోనిదని, కేంద్రానికి ఏ పాత్రా ఉండదని కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించడంతో బీజేపీపై ఆశలు పెట్టుకున్నవారు నీరుగారిపోయారు. అయితే మోడీ రాజధానికి ఎందుకు శంకుస్థాపన చేశారన్నది అర్థం కాని విషయంగా మారింది. దేశంలో ఇలాంటి పద్దతి ఉంటుందా అన్నది కూడా గట్టిగా చెపపడం లేదు. మొత్తంగా ఎపి వ్యవహారాలు అభివృద్ధి కన్నా వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నాయన్నట్లుగా ఉన్నాయి.

# సిఎం కెసిఆర్ ఆదేశాలు పాటించండి

### గిరిజన గ్రామాల్లో త్రీఫేజ్ ఇవ్వండి

### పాడి అభివృద్ధి కింద పాడిబర్లను పంపిణీ చేయాలి

### అధికారులను ఆదేశించిన మంత్రి సత్యవతి

హైదరాబాద్,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ మేరకు సింగిల్ ఫేజ్ కరెంట్ ఉన్న గిరిజన గ్రామాలు, ఆవాసాల్లో వెంటనే త్రీ ఫేజ్ కరెంట్ ఇవ్వాలని గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ అధికారులను ఆదేశించారు. కోడంగల్, మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాల్లో 10కోట్ల రూపాయలతో గిరిజనులకు పాడి అభివృద్ధి కింద పాడిబర్లను పంపిణీ చేపట్టాలని ఆదేశించారు.

ట్రైబల్ స్పెషల్ డెవలప్ మెంట్ ఫండ్ కింద అందుబాటులో ఉన్న 163.67 కోట్ల రూపాయల ద్వారా నిర్ణయించిన నోడల్ ఏజన్సీలతో గిరిజన గ్రామాలు, తండాల్లో సింగిల్ ఫేజ్ కరెంట్ 3 ఫేజ్ కరెంటుకు మార్చడం, కోడంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో గిరిజనులకు డెయిరీ డెవలప్ మెంట్ కింద బర్రెల పంపిణీ, గిరిజన ప్రాంతాల్లో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు త్వరగా పూర్తి చేయడంపై మంత్రి గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్, కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తు, ఆర్థిక శాఖ కార్యదర్శి శ్రీదేవి, ఎస్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు, టీఎస్ ఐడీసీ డైరెక్టర్ విద్యాసాగర్, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేశారు.

గ్రామీణ విద్యుదీకరణ పథకం కింద సింగిల్ ఫేజ్ కరెంట్ ఉన్నట్లు గుర్తించిన 2,221 గిరిజన గ్రామాలకు త్రీ ఫేజ్ కరెంట్ ఇవ్వడం కోసం మొదటి దశలో 117.82 కోట్ల రూపాయలను కేటాయించారని తెలిపారు. వెంటనే ఈ పనులు చేపట్టి పూర్తి చేస్తే గిరిజనులకు చాలా ఉపయోగపడుతుందని మంత్రి తెలిపారు. తెలంగాణ ఎస్పీడీసీఎల్ సీఎండీ స్పందిస్తూ ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల వల్ల గిరిజన గ్రామాల్లో నీరు బాగా ఉందని, వర్షాలు ఆగిపోయిన వెంటనే పనులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. మంత్రి కేటీఆర్ కోడంగల్ నియోజక వర్గాన్ని దత్తత తీసుకున్నారు. అక్కడి గిరిజనుల అభివృద్ధి కోసం డెయిరీ డెవలప్ మెంట్ పాడి బర్ల పంపిణీ ద్వారా స్వయం ఉపాధి కల్పిస్తామని తెలిపారు. దీనికి గిరిజన శాఖ ఇప్పటికే నిధుల ప్రతిపాదనలు పూర్తి చేసిందని, సంబంధిత నోడల్ ఏజన్సీ పనులు చేపట్టాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో డెయిరీ డెవల ప్‌మెంట్ పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభిస్తున్నామని, ఇది విజయవంతం అయితే అంతటా విస్తరిస్తామని మంత్రి తెలిపారు. గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు సాగునీరందించేందుకు 2015లో 70 కోట్ల రూపాయలతో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ప్రారంభించి, పూర్తి చేశారని దీనికి ఆర్థిక శాఖ ధ్రువీకరణ కావాలని టీఎస్ ఐడీసీ డైరెక్టర్ విద్యాసాగర్ కోరారు. గిరిజన ప్రాంతాల్లో ఆవాసాలకు త్రీ ఫేజ్ కరెంట్ ఇవ్వడం, గిరిజనులకు డెయిరీ డెవలప్ మెంట్ కార్యక్రమం తీసుకోవడం వంటివి చాలా మంచి కార్యక్రమాలని వీటికి ఆర్థిక శాఖ నుంచి ఎలాంటి సమస్యలు లేవని, ఈ ప్రతిపాదనలన్నింటికి ఆమోదం ఇస్తున్నట్లు ఆర్థికశాఖ కార్యదర్శి శ్రీదేవి ప్రకటించారు. అదేవిధంగా లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించి 70 కోట్లరూపాయల ప్రతిపాదనలు వెంటనే పంపితే ధ్రువీకరిస్తామన్నారు.

# రైతు సంక్షేమ పథకాలపై కేంద్రం ప్రశంసలు

### రైతుబంధు,సమితిల ఏర్పాటుకు అభినందనలు

### వ్యవసాయశాఖ మంత్రి తోమర్ వీడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): తెలంగాణలో అమలు చేస్తున్న రైతుబంధు, రైతు సమన్వయ సమితిల ఏర్పాటును కేంద్ర ప్రభుత్వం ప్రశంసించింది. రాష్ట్రంలో రైతుబంధు సహా వ్యవసాయాభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నారని కేంద్ర వ్యవసాయశాఖ అభినందించింది. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ గురువారం వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, వ్యవసాయశాఖ మంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కేంద్ర కొత్తగా తీసుకువస్తున్న అగ్రికల్చర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ స్కీమ్‌పై రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలను కోరారు. ఈ సందర్భంగా దేశంలో వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు వివరించిన కేంద్ర వ్యవసాయశాఖ సహాయ కార్యదర్శి సంజయ్ అగర్వాల్.. తెలంగాణలో అమలవుతున్న పథకాలను ప్రశంసించారు. రైతుబంధు, రైతుసమన్వయ సమితి అంశాలను సమావేశంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. రైతు సమితులతో రైతులు సంఘటితమయ్యే అవకాశం కలిగిందన్నారు. వీటి ద్వారా కేంద్రం కొత్తగా తెస్తున్న పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయవచ్చని అగర్వాల్ పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి కేంద్రానికి పలు సూచనలు చేశారు. వ్యవసాయ, మౌలిక సదుపాయాల పెట్టుబడి పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం స్వాగతిస్తుందన్నారు. వ్యవసాయరంగంలో పెట్టుబడులు పెట్టే వారికి వడ్డీ భారంగా మారకుండా చూడాలని సూచించారు. రాష్ట్రంలో పంటల సాగు వివరాలు వెల్లడించిన మంత్రి.. తగినంత యూరియా త్వరగా సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ మార్కెట్ల నిర్వహణలో సంస్కరణలకు సంబంధించి స్పష్టత ఇవ్వాలని కోరారు. కాగా, నాబార్డు చైర్మన్‌తో ముందుగా నిర్ణయించిన సమావేశం ఉండడం వల్ల వీడియోకాన్ఫరెన్స్‌కు సీఎం కేసీఆర్ హాజరు కాలేకపోయారు. సమావేశంలో రైతుబంధు రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి జనార్ధన్ రెడ్డి కూడా వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

# 'వైఎస్సార్ వేదాద్రి' ఎత్తిపోతలకు జగన్ శంకుస్థాపన

### ఫిబ్రవరి 2021 నాటికల్లా ఈ ప్రాజెక్టును పూర్తిచేస్తాం

### ఆయా ప్రాంతాల మంచినీటి సమస్య తీరుస్తామన్నసిఎం

అమరావతి,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): సమస్యలను గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తాగు,సాగునీటి ప్రాజెక్టుల విషయంలో పూర్తి నిర్లక్ష్యం వహించారని అన్నారు.

'వైఎస్సార్ వేదాద్రి' ఎత్తిపోతల పథకానికి వీడియో లింక్ ద్వారా శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. వేదాద్రి నుంచి మంత్రులు అనిల్‌కుమార్ యాదవ్, పేర్నినాని, కొడాలి నాని, ఎమ్మెల్యేలు సామినేని ఉదయభాను, మొండితోక జగన్‌మోహన్‌రావు, కైలే అనిల్‌కుమార్, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, జిల్లా కలెక్టర్ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత విజయవాడకు అతి సమీపంలో ఉన్న నందిగామ, వత్సవాయి, పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట ప్రాంతాలు తాగు, సాగు నీటికి కటకటలాడే పరిస్థితి ఉందన్నారు. ఐదేళ్ల పాటు అధికారంలో ఉండి కూడా ఈ ప్రాజెక్టు చేస్తే మంచి జరుగుతుందని తెలిసినా కూడా గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 14 నెలల లోపు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాన చేశాం. ఫిబ్రవరి 2021 నాటికల్లా ఈ ప్రాజెక్టును పూర్తిచేయాలనే దృఢ సంకల్పం, లక్ష్యంతో ముందుకెళ్తున్నామని అన్నారు. నాగార్జున సాగర్ ఎడమ కాల్వ నుంచి ఈ ప్రాంతానికి అందాల్సిన నీరు అందడం లేదు. దీనికి పరిష్కారంగా ఈ ప్రాజెక్టును చేపట్టాం. ఈ ప్రాంతంలోని 38,627 ఎకరాలకు నీరు అందిస్తాం. డీబీఆర్ బ్రాంచ్ కెనాల్ పరిధిలోని 30 గ్రామాలకు, వాటితో పాటు జగ్గయ్యపేట మున్సిపాలిటీకి కూడా 'వైఎస్సార్ వేదాద్రి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం' ద్వారా నీరు అందిస్తామని సీఎం వెల్లడించారు. దాదాపు 2.7 టీఎంసీల నీటిని ఈ ప్రాంతానికి అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. రూ.490 కోట్లు ఖర్చు చేస్తున్నామని, ఈ ప్రాజెక్టు ద్వారా నీటి కటకట తీరి, ఈ ప్రాంతానికి మంచి జరగాలని కోరుకుంటున్నానని సీఎం పేర్కొన్నారు. వేదాద్రి ప్రాజెక్టు నిర్మాణానికి సంకల్పించడం ద్వారా రైతు బాంధవుడిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిలిచారని శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు అన్నారు. ఇది ముఖ్యమంత్రి పెళ్లి రోజు కానుకగా రైతుల కోసం ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తున్నట్టుగా జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి దంపతులు నూరు వసంతాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఎన్నో సంవత్సరాలుగా కన్న కలలు ఇప్పుడు నిజం కాబోతున్నాయన్నారు. దివంగత మహానేత వైఎస్సార్ అప్పట్లో ఈ ప్రాంతానికి మేలు చేశారని, మళ్లీ 15 ఏళ్ల తర్వాత ఇప్పుడు మళ్లీ ఈ ప్రాంతానికి మేలు జరుగుతుందన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల ఎకరాకు రూ.10 లక్షల రూపాయల విలువ పెరిగిందని.. రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. రైతు బాంధవుడిగా సీఎం నిలిచిపోతారన్నారు. సీఎం వచ్చిన వేళా విశేషం కారణంగా మంచిగా వర్షాలు పడ్డాయని, నీళ్లు అందుతున్నాయన్నారు. పెళ్లి రోజున ప్రారంభం అవుతుంది కాబట్టి, ఈ ప్రాజెక్టు తనకు ఎప్పటికీ గుర్తు ఉండిపోతుందని సీఎం వైఎస్ జగన్ వ్యాఖ్యానించారు.

# ఆక్స్‌ఫర్డ్ వ్యాక్సిన్‌కు మంచి రెస్పాన్స్

### కొనసాగుతున్న కోవిషీల్డ్ ట్రయల్స్

### మంచి ఫలితాలు వస్తున్నాయన్న సీరమ్

న్యూఢిల్లీ,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసిన వ్యాక్సిన్ భారత్‌లో రెండో దశ ప్రయోగ స్థాయిలో ఉంది. ఈ క్రమంలో పుణెకు చెందిన భారతి విద్యాపీఠ్ వైద్య కళాశాల, ఆసుప్రతిలో ఇద్దరు వాలంటీర్లకు బుధవారం ఈ వ్యాక్సిన్ ఇవ్వగా.. వారి ఆరోగ్యం, శరీర పనితీరు చక్కగా ఉన్నాయని వైద్యులు వెల్లడించారు. సీరమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఉత్పత్తి చేసిన ఈ 'కొవిషీల్డ్' వ్యాక్సిన్‌ను 32, 48 సంవత్సరాల వయసున్న ఇద్దరు వ్యక్తులకు మొదటి డోసు వేశారు. 'బుధవారం వ్యాక్సిన్ ఇచ్చిన దగ్గరి నుంచి మా వైద్య సిబ్బంది వారిని పరిశీలనలో ఉంచారు. వారిద్దరి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉంది. నొప్పి, జ్వరం, సైడ్ ఎఫెక్ట్స్, ఇతర అనారోగ్య సూచనలేమీ కనిపించలేదు. వారిని 30 నిమిషాల పాటు పరిశీలనలో ఉంచి, అనంతరం ఇంటికి పంపివేశాం. వారిని ఎప్పటికప్పుడు తమ సిబ్బంది సంప్రదిస్తూనే ఉందని భారతి విద్యాపీఠ్ డిప్యూటీ మెడికల్ డైరెక్టర్ జితేంద్ర ఓస్వాల్ వెల్లడించారు. నెలరోజుల తరవాత వారికి మరో డోసు ఇస్తామని తెలిపారు. మరికొంతమందికి కూడా వ్యాక్సిన్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ÷-రపంచంలోనే అతిపెద్ద వ్యాక్సిన్ తయారీదారైన సీరమ్ సంస్థ..ఆక్స్‌ఫర్డ్ వ్యాక్సిన్‌ను ఉత్పత్తి చేయడానికి బ్రిటన్‌కు చెందిన ఆస్ట్రాజెనికాతో భాగస్వామ్యం కుదుర్చుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆ సంస్థ భారత్‌తో దాని భద్రతను పరిశీలిస్తోంది.

# కస్టమర్ల కరోనా జాగ్రత్తలను పరిశీలిస్తున్న రోబో

### తమిళనాడులో వస్త్ర దుకాణాల్లో సరికొత్త ఆవిష్కరణ

చెన్నై,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): చిరునవ్వుతో కూడిన ఓ పలకరింపు మనసుకి హాయిని చేకూరుస్తుంది. తెలియని తనాన్ని దూరం చేస్తుంది. కొత్త ప్రదేశంలో బెరుకును పోగుడుతుంది. ఈజీ మూవింగ్‌కు ఉపకరిస్తుంది. పేరొందిన ఏ వస్త్ర దుకాణంలోకి వెళ్లినా నీట్‌గా తయారైన అమ్మాయిలు ప్రవేశమార్గాల వద్ద వినియోగదారులను చిరునవ్వుతో పలకిస్తూ లోపలికి ఆహ్వానిస్తుంటారు. ఇది ఒక ప్రమాణంగా దుకాణదారులు పాటిస్తుంటారు. తమిళనాడులోని తిరుచారపల్లిలో గల ఓ వస్త్ర దుకాణంలో సైతం చీరలో ఉన్న ఓ యువతి కస్టమర్లను పలకరిస్తుంది. కానీ ఆమె అమ్మాయి కాదు. మానవరూప రోబోట్. 'జఫిరా' అని పిలువబడే రోబోట్. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో పనిచేసే ఈ రోబోట్ దుకాణంలోకి ప్రవేశించే కస్టమర్ల సంఖ్యను ట్రాక్ చేస్తుంది. వారు సామాజిక దూరాన్ని పాటిస్తున్నది, మాస్కులు ధరించేలా పర్యవేక్షిస్తుంది. వారి ఉష్ణోగ్రతలను తనిఖీ చేస్తుంది. శానిటైజర్లను కూడా పంపిణీ చేస్తుంది. కరోనా వైరస్ వ్యాప్తి నిరోధానికి అనుసరించాల్సిన అన్ని చర్యలను పాటించేలా చూస్తుంది. రోజువారీగా స్టోర్‌లోకి ప్రవేశించిన వారి సంఖ్యను యజమానికి మెయిల్ చేస్తుంది. వాయిస్-యాక్టివేటెడ్ రోబోట్ అయిన జఫిరాకు వివిధ దుస్తువులను ధరింపజేయవచ్చు. తిరుచురాపల్లిలోని అన్ని బట్టల దుకాణాలలో వీటిని ఉపయోగిస్తున్నట్లు జఫీ రోబోట్స్ సీఈవో అశిక్ రెహ్మాన్ తెలిపారు. తమిళనాడు, కేరళలోని పలు స్టోర్ల నుంచి పెద్ద సంఖ్యలో తాము ఆర్డర్లు అందుకున్నట్లు పేర్కొన్నారు.

# పార్లమెంటరీ కమిటీలు గోప్యత పాటించాలి

### -స్టాండింగ్ కమిటీ చీఫ్‌లకు,సభ్యులకు వెంకయ్య లేఖ

న్యూఢిల్లీ,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): పార్లమెంటరీ ప్యానెల్స్‌కు సంబంధించిన రహస్య సమాచారాన్ని మీడియాకు లీక్ చేయొద్దని ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీల చైర్‌పర్సన్‌లు, కమిటీ సభ్యులను కోరారు. ఈ మేరకు ప్యానెల్ చీఫ్‌లకు ఆయన లేఖ రాశారు. కమిటీల చర్చలను, చర్చించే అంశాలను, శాసన బిల్లులను మీడియా తమ రిపోర్టింగ్‌లో చర్చిస్తూ, ప్రశ్నిస్తున్నట్లుగా తాను గమనించినట్లు చెప్పారు. కమిటీ సమావేశాల కార్యకలాపాలు గోప్యంగా ఉంటాయని మనందరికీ తెలుసన్నారు. వీరంతా గోప్యత పాటించాలని అన్నారు. కమిటీ సమావేశాల నిర్ణయాలను ఏ ఒక్కరితోనూ ప్రత్యక్షంగా గానీ లేదా పరోక్షంగా గానీ పంచుకునేందుకు అనుమతి లేదన్నారు. కమిటీ నివేదికలు, తీర్మానాలు సభలో ప్రవేశపెట్టే కంటే ముందే బహిర్గతపరిస్తే అది సభాధికారాన్ని ఉల్లంఘించినట్లేనన్నారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సైతం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీల అధ్యక్షులకు కొన్నిరోజుల క్రితం ఇలాంటి లేఖే రాశారు. ప్యానెల్ సమావేశాలను రహస్యంగా ఉంచాల్సిందిగా కోరారు. లోక్‌సభ స్పీకర్‌ను అనుసరించి రాజ్యసభ చైర్మన్ స్టాండింగ్ కమిటీల చైర్‌పర్సన్లు, సభ్యులకు లేఖ రాశారు. నివేదికలు బహిర్గతమయ్యేవరకు గోప్యతను పాటిస్తూ మీడియాకు అనవసరంగా సమాచారాన్ని లీక్ చేయొద్దని కోరారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ అధ్యక్షులుగా కాంగ్రెస్ పార్టీకి చెందినవారు ఉన్నారు. కమిటీ సమావేశాలకు అంశాలను ఎన్నుకోవడంపై ప్యానెళ్ల బీజేపీ సభ్యులతో గొడవ పడుతున్నందున ఈ లేఖ ప్రాముఖ్యతను సంతరించుకుంది. సంబంధిత అంశాలను చర్చించే ముందే కాంగ్రెస్ అధ్యక్షులు ఈ విషయాలను మీడియా దృష్టికి తీసుకువెళ్తున్నట్లుగా ఆరోపించారు.

# కరోనా సంక్షోభంలోనూ సత్తా చాటిన ఆపిల్

### -మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో రికార్డు

వాషింగ్టన్,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలు కరోనా మహమ్మారి కారణంగా తీవ్ర నష్టాల్లో కూరుకుపోతున్నాయి. అయితే పలు కంపెనీలు కరోనా సంక్షోభంలోనూ సత్తా చాటాయి. సంక్షోభ నేపథ్యంలోనే కొన్ని సంస్థలకు కలిసి వస్తున్నది. ఆపిల్ ఇంక్ 2.13 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్‌తో రికార్డు సృష్టించి ప్రపంచంలోనే అత్యంత విలువైన సంస్థగా నిలిచింది. సెర్చింజన్ గూగుల్(1.09 ట్రిలియన్ డాలర్లు), సోషల్ మీడియా దిగ్గజం(800 బిలియన్ డాలర్స్) రెండింటి మార్కెట్ క్యాపిటలైజేషన్ కంటే ఎక్కువగా ఉంది. ఆపిల్ 2 ట్రిలియన్ డాలర్ల మార్క్‌ను దాటింది. ఈ రికార్డుకు చేరుకున్న తొలి అమెరికా కంపెనీ ఇదే. ఏప్రిల్-జూన్ 2020 క్వార్టర్‌లో భారీ లాభాలను నమోదు చేసింది. కరోనా మహమ్మారి నేపథ్యంలో ఐఫోన్ సేల్స్ పడిపోయాయి. కానీ ఆపిల్ టీవీ, ఆపిల్ మ్యూజిక్, కొత్త ఐఫోన్ ఎస్ఈ భారీ లాభాలను తెచ్చి పెట్టింది. మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా టాప్ కంపెనీల్లో ఆపిల్ 2.135 ట్రిలియన్ డాలర్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఇది అమెరికా కంపెనీ. ఆ తర్వాత సౌదీ అరేబియాకు చెందిన సౌదీ ఆరామ్‌కో(2.049 ట్రిలియన్ డాలర్లు) ఉంది. అమెజాన్(1.676 ట్రిలియన్ డాలర్లు), మైక్రోసాఫ్ట్(1.638 ట్రిలియన్ డాలర్లు), అల్ఫాబెట్(గూగుల్-1.093 ట్రిలియన్ డాలర్లు), ఫేస్‌బుక్(800 బిలియన్ డాలర్లు)తో అమెరికాకు చెందిన ఈ కంపెనీలు వరుసగా 3వ, 4వ, 5వ, 6వ స్థానంలో ఉన్నాయి. చైనాకు చెందిన అలీబాబా(764.82 బిలియన్ డాలర్లు), టెన్సెంట్ 689.22 బిలియన్ డాలర్లతో వరుసగా 7, 8 స్థానాల్లో ఉన్నాయి. అమెరికాకు చెందిన కంపెనీలు బెర్క్‌షైర్ హాత్‌వే(509.54 బిలియన్ డాలర్లు), వీసా(456.87 బిలియన్ డాలర్లు), జాన్సన్ అండ్ జాన్సన్(400.34 బిలియన్ డాలర్లు) వరుసగా 9, 10, 11వ స్థానాల్లో ఉండగా, 12వ స్థానంలో తైవాన్‌కు చెందిన టీఎస్ఎంసీ 383.58 బిలియన్ డాలర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ కలిగిఉంది. ఆపిల్ ఇంక్ 2 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ క్యాపిటలైజెషన్‌తో రికార్డ్ సృష్టించింది. అమెరికా జీడీపీలో ఆపిల్ ఇంక్ దాదాపు 10 శాతంగా ఉంటుంది. భారత జీడీపీతో చూస్తే నాలుగింట మూడింతలు ఉంటుంది. 0 నుంచి 1 ట్రిలియన్ డాలర్ల కంపెనీగా ఎదగడానికి ఆపిల్‌కు 42 ఏండ్లు పట్టింది. అయితే 1 ట్రిలియన్ డాలర్ల నుంచి 2 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవడానికి కేవలం రెండేళ్లు మాత్రమే తీసుకుంది. దాదాపు జూలై 31వ తేదీ నుంచి ఆపిల్ మోస్ట్ వ్యాల్యుబుల్ కంపెనీగా ఉంది.

# కరోనా రోగుల కోసం అత్యుత్తమ పరికరాలు

### -సిఎస్ సోమేశ్‌కు అందచేసిన డీజియె సంస్థ

హైదరాబాద్,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): కరోనా రోగులకు ఎమర్జెన్సీ పరిస్థితుల్లో వినియోగించే లైఫ్ సేవ్ ఎక్విప్‌మెంట్ హై ఫ్లో నాసల్ కెన్యులా(హెచ్ఎఫ్ఎన్‌సి) పరికరాలను బెంగళూరుకు చెందిన డీజియో సంస్థ రాష్ట్రానికి విరాళంగా అందజేసింది. ఈమేరకు గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌ను కలసి వంద పరికరాలను అందజేశారు. సామాజిక బాధ్యతగా రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు వీటిని అందజేసినట్టు సంస్థ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ ప్రత్మేశ్ మిశ్రా తెలిపారు. కోవిడ్ తీవ్రత వల్ల ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న రోగులను కాపాడేందుకు హై ఆక్సీజన్ అవసరమైన వారికి హెచ్ఎఫ్ఎన్‌సి, బిపాప్ పేరుతో పిలిచే ఈ పరికరాన్ని వాడతారు. ఈ పరికరాన్ని గాంధీ, నిమ్స్, కింగ్‌కోఠి, చెస్ట్, టిమ్స్‌లో ఈ పరికరాలను ఏర్పాటుచేయనున్నట్టు అధికారులు తెలిపారు. అలాగే రాష్ట్రంలోని పలు ముఖ్యమైన హాస్పిటల్స్‌లోనూ వీటిని అమర్చు తామని టీఎస్ఎంసిఐడిసి మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖరరెడ్డి తెలిపారు.

# పాజిటివ్ కేసులతో జిల్లా ప్రజల్లో ఆందోళన

## గతంలో కన్నా పెరుగుతున్న కేసులు

కరీంనగర్,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): జిల్లాలో కరోనా పాజిటివ్ కేసులు తీవ్రమవుతున్నాయి. తక్కువ కేసులు ఉన్నప్పుడు కట్టుదిట్టమైన చర్యలతో కరోనాకు అడ్డుకట్ట వేసినా... లాక్‌డౌన్ సడలింపుల అనంతరం కేసులు పెద్ద సంఖ్యలో నమోదవుతున్నాయి. గత వారం రోజులుగా కరోనా కేసులు విపరీతంగా పెరుగుతూ జిల్లా యంత్రాంగానికి సవాలుగా మారుతున్నాయి. కాంటాక్టుల సంగతి దేవుడెరుగు కేసులను ట్రేస్‌చేయడం కూడా వైద్యాధికారులకు కత్తిమీద సాములా మారింది. మరణాలు తక్కువగా ఉండడంతో పాటు వైరస్ బారిన పడినవారు త్వరగా కోలుకుంటుండడం కాస్త ఉపశమనం కలిగిస్తోంది. కరీంనగర్ పట్టణంతో పాటు అన్ని ప్రాంతాల్లో పాజిటివ్ కేసులు నమోదవుతుండడం, కంటైన్‌మెంట్‌లతో కరోనా బాధిత కుంటుంబాలు తీవ్ర మనోవేదనను అనుభవిస్తున్నాయి. పాజిటివ్ వ్యక్తులకు పరిసర ప్రాంతాల్లో ఉన్నవారు భయంతో వణికిపోతున్నారు. ఇప్పటి వరకు కేసులసంఖ్య 6,000కు చేరుకున్నాయి. ఇందులో 2,300 యాక్టివ్ కేసులు ఉన్నాయి. 3500 మంది కోలుకున్నారు. 74మంది మృతిచెందారు. ప్రతి రోజు 500కు తక్కువ కాకుండా ఆర్టీపీసీఆర్, ర్యాపిడ్ యాంటిజెన్ రూపంలో శాంపిల్స్ తీసుకుని టెస్టులు చేస్తున్నారు. పాజిటివ్‌లతో పోలిస్తే మరణాలు తక్కువగా ఉండడంతో పాటు వైరస్ బారిన పడినవారు త్వరగా కోలుకుంటుండడం కాస్త ఉపశమనం కలిగిస్తోంది. కరీంనగర్ పట్టణంతో పాటు అన్ని ప్రాంతాల్లో పాజిటివ్ కేసులు నమోదవు తుండడం, కంటైన్‌మెంట‌లతో కరోనా బాధిత కుంటుంబాలు తీవ్ర మనోవేదనను అనుభవిస్తున్నాయి. పాజిటివ్ వ్యక్తులకు పరిసర ప్రాంతాల్లో ఉన్నవారు భయంతో వణికిపోతున్నారు. కరోనా వ్యాప్తికి అజాగ్రత్తలే కారణంగా కనిపిస్తున్నాయి. అనుమానితులుగా ఉన్నప్పుడే స్వీయ నిర్బంధం పాటించడం, కనీసం ఇంక్యూబేషన్ పీరియడ్ పూర్తయ్యే వరకూ అనుమానితులు ఎవరినీ కలవకుండా కనీస రక్షణ చర్యలు పాటించి ఉంటే వైరస్‌చైన్‌ను తెంచే అవకాశాలు ఉంటాయి. కొందరు మాత్రం నిర్లక్ష్యంగా వహిస్తున్నారు. పాజిటివ్ వ్యక్తుల ప్రైమరీ కాంటాక్టులను గుర్తించే పరిస్థితి లేకపోవడంతో వైద్యాధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. కరోనా పాజిటివ్ వచ్చిన వ్యక్తులు చాలా మంది హోం ఐసోలేషన్‌లోనే ఉంటూ చికిత్స పొందుతున్నారు. అయితే హోం ఐసోలేషన్‌లో ఉన్న వారు తమ పనులకు తామే బయటకు వెళ్తుండడంతో జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. కొన్ని పాజిటివ్ కేసుల్లో లక్షణాలు బయటకు కనిపించకపోవడంతో చాలా మంది తమకు కరోనా లేదనే భ్రమలోనే ఉంటున్నారు. కొందరు పరీక్షలు చేసుకున్న విషయం రహస్యంగా ఉంచడంతో అది ఇతరులకు అంటుకుంటోంది.

# ప్రకృతి వనాలతో పల్లెల్లో ఆహ్లాదం

హైదరాబాద్,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రంలో పంచాయతీ రాజ్ చట్టం తెచ్చిన మార్పులతో ఆకు పచ్చ తెలంగాణ ఆవిష్కృతం అవుతున్నదని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. తెలంగాణ పల్లెల ప్రకృతి వనాలపై తన ట్విట్టర్ లో ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ప్రకృతి వనాలు పల్లెలకు కొత్త అందాలను అద్దుతున్నాయని ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ కు ఎర్రబెల్లి ధన్యవాదాలు తెలిపారు. కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో ఆయా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ఎకరం స్థలంలో ప్రకృతి వనాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రకృతి వనాలతో పల్లెల్లో ఆహ్లాద వాతావరణం ఏర్పడుతున్నదని మంత్రి ఎర్రబెల్లి పేర్కొన్నారు.

# యువ భారత్ 'ఫిట్ ఇండియా' కావాలి

**(29 ఆగష్టు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా)**

ప్రఖ్యాత భారత హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ పుట్టిన రోజు 29 ఆగష్టున ఇండియాలో "జాతీయ క్రీడా దినోత్సవం" జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. అలహాబాదు సమీపానగల కుష్వాహలో శారద మరియు సోమేశ్వర్ సింగ్ దంపతులకు 29 ఆగష్టు 1905న ధ్యాన్ సింగ్ జన్మించారు. తండ్రి బ్రిటీష్ ఆర్మీలో పని చేస్తూ హాకీ ఆడేవారు. ధ్యాన్ సింగ్ తన 16వ ఏటనే బ్రిటీష్ ఇండియన్ ఆర్మీలో చేరిన సుబేదార్ మేజర్ తీవారి ప్రేరణ మరియు శిక్షణతో హాకీ క్రీడ పట్ల ఆసక్తి పెంచుకున్నారు. ఉద్యోగ విధులు నిర్వహించిన తరువాత హాకీ అభ్యాసం పండు వెన్నెల వెలుగుల్లో కూడా చేసేవారు. హాకీ పట్ల ఆకర్షణ పెరిగి వెన్నెలలో ప్రాక్టీస్ చేయడాన్ని చూసిన సహచరులు ధ్యాన్ సింగ్‌ను 'చాంద్' (చంద్రుడు)గా పిలిచేవారు. కాలక్రమంలో ధ్యాన్ సింగ్ పేరు 'ధ్యాన్ చంద్'గా మారింది. 1922 నుండి 1926 వరకు ఆర్మీ హాకీ జట్టులో సభ్యుడిగా అనేక పోటీలలో తన ప్రతిభను ప్రదర్శించడ కారణంగా 1926లో భారత హాకీ జట్టులో స్థానం సంపాదించి 1948 వరకు తన ప్రతిభను ప్రపంచ క్రీడా వేదికలో పరిచయం చేశారు. భారత జట్టులో ముఖ్య క్రీడాకారుడిగా 400 అంతర్జాతీయ పోటీల్లో గోల్స్ చేయడం విశేషంగా చెప్పవచ్చు. తన 22 సంవత్సరాల హాకీ కేరీర్‌లో 1000కి పైగా గోల్స్ చేసి ప్రపంచ ప్రఖ్యాత హాకీ క్రీడాకారుడిగా పేరు సుస్థిరం చేసుకున్నారు. ఆటకు ముగ్ధులైన ప్రేక్షకులు ధ్యాన్ చంద్‌ను "హాకీ క్రీడా మాంత్రికుడు"గా అభివర్ణించడం వెనుక అతని క్రీడా ప్రతిభ దాగి ఉంది. భారతదేశానికి హాకీలో స్వర్ణయుగంగా భావించే రోజుల్లో వరుసగా మూడు ఒలంపిక్ బంగారు పతకాలను 1928,1932,1936లలో సాధించి పెట్టడంలో జట్టు సభ్యుడిగా ధ్యాన్ చంద్ పాత్ర మరువలేనిది. తన క్రీడా నైపుణ్యాలను గుర్తించిన బ్రిటీష్ ఇండియన్ ఆర్మీ బాధ్యులు పలు పదోన్నతులను కల్పించుట ఫలితంగా మేజర్ స్థాయికి ఎదిగి 1956లో పదవి విరమణ చేశారు. ఆటకు ముగ్ధుడైన అడాల్ఫ్ హిట్లర్ ధ్యాన్ చంద్‌కు జర్మన్ పౌరసత్వం తీసుకొని తమ జట్టులో ఆడమని ఆహ్వానించగా, సున్నితంగా తిరస్కరించి తన దేశభక్తిని చాటుకున్నారు. 2002లో దేశ రాజధానిలోని జాతీయ హాకీ స్టేడియంకు ధ్యాన్ చంద్ జాతీయ హాకీ స్టేడియంగా నామకరణం చేశారు. క్రికెట్ పరుగుల్లా హాకీ గోల్స్ చేస్తావని ధ్యాన్ చంద్‌ను ప్రముఖ క్రికెట్ దిగ్గజం డాన్ బ్రాడ్‌మెన్ ప్రస్తుతించడం కొస మెరుపు.

29 ఆగష్టు రోజున జరుపుకునే జాతీయ క్రీడా దినం సందర్భంగా క్రీడల ప్రాధాన్యత, శారీరక మానసిక వికాసం, క్రీడా స్ఫూర్తి, క్రీడల పట్ల అవగాహన మరియు క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించడం, క్రీడల నిర్వహణ లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. క్రీడల ద్వారా యువతకు గుర్తింపు, ఉద్యోగంతో పాటు శారీరక మానసిక పటుత్వం కలుగుతుందనే విషయాలను ప్రచారం చేయాలి. 2012 నుండి ప్రారంభమైన జాతీయ క్రీడా దినాన్ని వేదికగా చేసుకొని జాతీయ అంతర్జాతీయ సమైక్యత సాధించుట జరుగుతుంది. జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా అత్యున్నత క్రీడా నైపుణ్యం ప్రదర్శించే దేశీయ క్రీడాకారులకు అర్జున, ద్రోనాచార్య, మరియు ఖేల్ రత్న అవార్డులు భారత రాష్ట్రపతి చేతుల మీదుగా అందించడం జరుగుతుంది. ఈ రోజున ఆటల పోటీలు, క్రీడా పరుగు, ర్యాలీలు లాంటివి దేశవ్యాప్తంగా ప్రభుత్వ క్రీడా విభాగం మరియు స్థానిక స్వచ్ఛంధ సంస్థలు నిర్వహిస్తాయి. గత సంవత్సర జాతీయ క్రీడా దినోత్సవంలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ 'ఫిట్ ఇండియా ఉద్యమం' ప్రారంభించారు. ఫిట్ ఇండియా ప్రచారంలో భాగంగా దేశ యువత శారీరక పటుత్వం కోసం క్రీడలు లేదా ఇతర వ్యాయామాలలో ప్రతి రోజు పాల్గొనాలని ఉద్దేశించారు. ఫిట్ ఇండియా ఉద్యమంలో భాగంగా యువతీయువకులు ప్రతి దినం కనీసం 10,000 అడుగులు వేసేలా తమ దినచర్యను మార్చుకోవాలని సూచించారు. విద్యాలయాలలో క్రీడల పట్ల ఆసక్తి కలిగేలా, సంప్రదాయ భారత గ్రామీణ క్రీడలు అంతరించకుండా కార్యక్రమాలను రూపకల్పన చేయాలని కోరారు. హాకీ స్టిక్‌కు మరియు బాల్‌కు మధ్య అయస్కాంత ఆకర్షణ ఉన్నట్లు, బాల్ దొరికితే తప్పనిసరిగా గోల్ చేసేవారుగా ధ్యాన్ చంద్‌కు పేరుంది. 'పరుగుల రాణి'గా పీటీ ఉష, 'మాస్టర్ బ్లాస్టర్'గా సచిన్ టెండూల్కర్ లాగా 'హాకీ విజర్డ్'గా మేజర్ ధ్యాన్ చంద్ గుర్తించబడడం భారతీయులందరికి గర్వకారణం. 1956లో భారత ప్రభుత్వం నుండి పద్మభూషణ్ ఆవార్డు స్వీకరించిన ధ్యాన్ చంద్ 03 డిసెంబర్ 1979న మరణించినప్పటికి, ఆయన జీవితం నేటి యువతకు సదా ప్రేరణ కాగలదనడంలో అతిశయోక్తి లేదు.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# కరోనా కట్టడిలో తెలంగాణ సర్కార్ విఫలం

## ప్రజల మరణాలకు కెసిఆర్, ఈటెలదే బాధ్యత
## -చలో ఆస్పత్రుల సందర్శనలో మల్లు భట్టి

నిర్మల్,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): కరోనా మరణాలకు సిఎం కేసీఆర్, వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటెల రాజేందర్‌లే కారణమని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. ప్రజలు ఆందోళన చెందుతున్నా సీఎం కేసీఆర్ ఫామ్ హౌజ్‌లో మొద్దు నిద్రపోతున్నారని మండిపడ్డారు. ఆస్పత్రుల పరిశీలనలో భాగంగా నిర్మల్ పర్యటన సాగింది. ఈ సందర్భంగా నిర్మల్‌లో శుక్రవారం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని సందర్శించిన భట్టి... రోగుల కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కరోనాని ఆరోగ్యశ్రీలో చేర్చాలని డిమాండ్ చేశారు. పేదలకు పౌష్టికాహారంతో పాటు ఇమ్యూనిటీ పెంచే మందులను ప్రతినెలా రేషన్ షాపుల్లో అందించాలని అన్నారు. మినరల్ రిసోర్స్ నిధులను ఆసుపత్రుల అభివృద్ధికి ఖర్చు పెట్టాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో ఆయా ఏరియాల్లో వైద్య సౌకర్యాలు మెరుగుపర్చాలని చెప్పారు. కరోనా చికిత్సలో ప్రైవేటు ఆసుపత్రుల దోపిడీని కట్టడి చేయాలని... ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే కరోనా మరింత వ్యాప్తి చెందే అవకాశం ఉందని భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణలో కరోనా మరణాలకు సీఎం కేసీఆరే బాధ్యత వహించాలని భట్టి విక్రమార్క అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీస సౌకర్యాలు లేవని ఆయన విమర్శించారు. కరోనాతో ప్రజలు చస్తుంటే.. మంత్రులు కేసీఆర్‌కు భజన చేస్తున్నారని విమర్శించారు. నిజాలు మాట్లాడినవారిపై కేసీఆర్ బ్యాచ్ ఎదురుదాడికి దిగడమే లక్ష్యంగా పెట్టుకుందని భట్టి విక్రమార్క అన్నారు. గత ఏడాది ఆస్పత్రి ఎలా ఉందో.. అప్పటి కంటే దౌర్భగ్యంగా ఉందన్నారు. ఆనాడు కరోనా బాధితులు లేరని, 50 శాతం ఖాళీలను భర్తీ చేయలేదన్నారు. పడకలు పెంచారని చెబుతున్నారని, కానీ డాక్టర్లు, సిబ్బందిని మాత్రం పెంచలేదని విమర్శించా రు. ఇంత కంటే దుర్మార్గం మరొకటిలేదని.. ఈ ప్రభుత్వాన్ని ఏం చేసినా తప్పులేదన్నారు. ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఆస్పత్రిలోనే సరైన సదుపాయాలు లేవని భట్టి విక్రమార్క విమర్శించారు. ఆర్టీపీసీఆర్ సరిగా పనిచేయ డంలేదని, అందరినీ హోం క్వారంటైన్‌కు పంపిస్తున్నారని అన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు కరోనాతో బిక్కు బిక్కుమంటూ బతుకుతున్నారని, దీనంతటికి కారణం సీఎం కేసీఆరేనని భట్టి ఆరోపించారు. మద్యం, బెల్టు షాపులు బంద్ చేయమని సూచించామని.. అయినా ప్రభుత్వం విచ్చలవిడిగా వదిలేసిందన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఫీజులు దారుణంగా వసూలు చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవ డంలేదని భట్టి విక్రమార్క మండిపడ్డారు.

# అచ్చెన్నాయుడుకు బెయిల్ మంజూరు

## షరతులతో మంజూరు చేసిన హైకోర్టు

అమరావతి,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): ఈఎస్ఐ స్కాంలో అరెస్ట్ అయి జైల్లో ఉన్న అచ్చెన్నాయుడికి బెయిల్ మంజూరు అయింది. అయితే కోర్టు అనుమతి లేనిదే దేశం విడిచి వెళ్లరాదని పేర్కొంది. అచ్చెన్నాయుడు బెయిల్ పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో రెండు రోజుల క్రితమే వాదనలు ముగిశాయి. వాదనలు విన్న హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. ఈఎస్ఐ స్కామ్ కేసులో అచ్చెన్నాయుడుని అరెస్ట్ చేసింది ఏసీబీ వైద్య పరికరాలు, మందుల కొనుగోలు కుంభకోణంలో డీలర్ల నుంచి అచ్చెన్నాయుడికి డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఇక, మొదట ఏసీబీ కోర్టులో బెయిల్ కోసం ప్రయత్నాలు చేసిన అచ్చెన్నాయుడు... అక్కడ బెయిల్ రాకపోవడంతో... హైకోర్టును ఆశ్రయించారు. గతంలో అచ్చెన్నాయుడుకు బెయిల్ నిరాకరించింది హైకోర్టు.. దీంతో.. ఈసారి తీర్పు ఎలా రాబోతుందనే ఉత్కంఠ నెలకొంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయనకు కరోనా కూడా సోకింది. దీంతో ఆయనకు బెయిల్ మంజూరు చేసింది.

కోవిడ్ కారణంగా ఆయన ప్రస్తుతం మంగళగిరిలోని ఎన్నారై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు బెయిల్ మంజూరు చేయాలని గతంలో కోర్టుకు దరఖాస్తు చేయగా న్యాయస్థానం తిరస్కరించింది. మరోసారి బెయిల్ మంజూరు చేయాలని అచ్చెన్న తరఫు న్యాయవాదులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది సిద్దార్థ లోద్ర, హైకోర్టు సీనియర్ న్యాయవాది వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. దీంతో హైకోర్టు అచ్చెన్నాయుడికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. రూ. 2 లక్షలు షూరిటీ ఇవ్వాలని, కోర్టు అనుమతి లేకుండా దేశం దాటి వెళ్లవద్దని, సాక్షులను తారుమారు చేయవద్దని, దర్యాప్తు అధికారికి అందుబాటులో ఉండాలని ఆదేశాల్లో పేర్కొంది.

# సహకారం, భాగస్వామ్యం, నిబద్ధత భారతదేశం మరియు ఆసియాన్ దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యానికి మార్గనిర్దేశం చేస్తున్నాయి : శ్రీ పీయూష్ గోయల్.

న్యూ ఢిల్లీ, ఆగస్టు 28: భారతదేశం మరియు ఆసియాన్ దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యానికి, 3 'సి' లు- సహకారం, భాగస్వామ్యం మరియు నిబద్ధత, మార్గనిర్దేశం చేస్తాయని వాణిజ్య, పరిశ్రమల మంత్రి శ్రీ పియూష్ గోయల్ ఈ రోజు చెప్పారు. ఆసియాన్-ఇండియా వాణిజ్య మండలి ఆన్ లైన్ సమావేశంలో శ్రీ గోయల్ మాట్లాడుతూ, కోవిడ్-19 మహమ్మారి కాలం భారతదేశం ప్రపంచానికి విశ్వసనీయ భాగస్వామిగా తనను తాను నిరూపించుకోవడానికి ఒక ప్రత్యేకమైన అవకాశాన్ని అందించిందని, ముఖ్యంగా ఒత్తిడి సమయాల్లో అందించిందని పేర్కొన్నారు. ఆసియాన్ ప్రాంతానికి శ్రీ గోయల్ స్నేహ హస్తాన్ని అందిస్తూ, ఇది లోతైన మరియు విలువైన భాగస్వామ్యం మరియు పురోగతితో కూడిన భాగస్వామ్యం అని అభివర్ణించారు.

ఆత్మ నిర్భర్ భారత్ స్వావలంబన గల దేశాన్ని సూచిస్తుంది, ఇది బలం మరియు విశ్వాసం యొక్క స్థానం నుండి మరియు సమాన మరియు న్యాయమైన నిబంధనలతో ప్రపంచంతో నిమగ్నమవ్వడానికి సిద్ధంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. వివిధ కారణాల వల్ల భారతదేశం మరియు ఆసియాన్ పూర్తి వాణిజ్య సామర్థ్యాన్ని ఉపయోగించుకోలే కపోయాయనీ, అయితే, వాణిజ్యాన్ని విస్తరించడానికి, అన్ని దేశాలు మరియు వ్యాపారాల సమస్యలను పరిష్కరించడానికి మరియు తేడాలను సరిదిద్దడానికీ, మాతృకను తెరవడానికి ఇది అనువైన సమయమని ఆయన తెలియజేశారు. వ్యాపారాల ద్వారా భారతదేశ స్నేహాన్ని మరియు భాగస్వామ్యాన్ని ఆసియాన్‌కు ఆయన విస్తరించారు. తద్వారా భాగస్వాములిద్దరూ కలిసి విజయవంతం కాగలరు, భవిష్యత్తును భద్రపరచగలరు, కలిసి పనిచేయగలరు, శ్రేయస్సు సాధించగలరు, 300 బిలియన్ డాలర్ల వాణిజ్య లక్ష్యాన్ని సాధించగలరు. వ్యాపార మండలి సమావేశం ఆందోళనలు మరియు ఉత్తమ పద్ధతులను చర్చించడానికి, ఆలోచనలను పంచుకోవడానికి మరియు సమస్యలను పరిష్కరించుకోడానికీ ఒక మంచి వేదిక అని శ్రీ గోయల్ అన్నారు.

మహమ్మారి ప్రారంభ రోజుల్లో, కోవిడ్ -19 తో పోరాడవలసిన అవసరాల కోసం భారతదేశం ప్రపంచ దేశాలను సహాయం కోరింది, అయితే ప్రతి ఒక్కరూ తమ సొంత అవసరాల కోసం ఆరాటపడుతున్నందున, భారతదేశానికి సహాయం చేయడానికి ఎవరూ ముందుకు రాలేదని, శ్రీ గోయల్ పేర్కొన్నారు. కానీ, మరోవైపు, ఔషధాలను అందించగల సామర్థ్యంతో భారతదేశం ప్రపంచానికి ఫార్మసీగా పనిచేసింది. ప్రపంచంలోని 150 కి పైగా దేశాలకు, ప్రపంచంలోని ప్రతి ప్రాంతానికి, ముఖ్యంగా తక్కువ అభివృద్ధి చెందిన దేశాలకు మేము మందులు సరఫరా చేసాము.

ప్రారంభం లో కొన్ని ఆంక్షలు విధించినప్పటికీ, పేద దేశాలకు మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలనే గొప్ప ఉద్దేశ్యంతోనే ఇది జరిగింది. ఇవన్నీ భారతదేశం స్థితిస్థాపకంగా ఉన్న దేశం, విశ్వసనీయ భాగస్వామి మరియు నిజంగా స్నేహితుడు అని ప్రపంచానికి చూపించింది. పి.పి.ఇ.లు; మాస్కులు తయారు చేయడానికి దేశం తగిన సామర్థ్యాన్ని అభివృద్ధి చేసిందనీ, మా పరీక్షా సామర్థ్యాలను రోజుకు 1000 లోపు నుండి రోజుకు మిలియన్ కు పైగా పెంచామనీ, శ్రీ గోయల్ చెప్పారు. "ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో మేము స్వయం సమృద్ధిగా ఉన్నాము. ఈ కాలంలో, భారతీయులు సామాజిక దూరాన్ని కొనసాగించడానికి, వ్యక్తిగత పరిశుభ్రతను తగినంతగా చూసుకోవటానికి, అన్ని సమయాల్లో మాస్కును ధరించడానికి మరియు సన్నిహితులను జాగ్రత్తగా సంరక్షించుకోడానికి నిబద్ధత మరియు స్పృహను అభివృద్ధి చేసుకున్నారు. " అని, మంత్రి వివరించారు.



భద్రాచలంలో కోవిడ్ అంబులెన్స్‌లను ప్రారంభించిన మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

# కరోనా కట్టడికి కట్టుదిట్టమైన చర్యలు

## -కోవిడ్ అంబులెన్స్‌లు ప్రారంభించిన మంత్రి పువ్వాడ

భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): కొవిడ్ ను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు.

కరోనా టెస్టులను పెంచడమే గాకుండా వైద్యాన్ని కూడా పేదలకు అందుబాటులోకి తీసుకుని వచ్చామని అన్నారు. శుక్రవారం భద్రాద్రి జిల్లాలోని ప్రభుత్వ ప్రధాన దవాఖానలో ఏర్పాటు చేసిన కొవిడ్ అంబులెన్సులు, కొవిడ్ సంచార పరీక్ష వాహనాన్ని మంత్రి ప్రారంభించారు. మంత్రి విజ్ఞప్తి మేరకు గత సంవత్సరం హడ్కో సంస్థకు లేఖ రాశారు. స్పందించిన ఆయా సంస్థ రూ. 60.69 లక్షల విలువగల అడ్వాన్స్ అంబులెన్స్ లు మంజూరు చేసింది. అనివార్య కారణాల వల్ల నేడు ఎదుర్కొంటున్న కొవిడ్ కు ఆయా అంబులెన్స్‌లను వినియోగించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సమకూర్చిన పూర్తి అధునాతన 2 అంబులెన్సులు జిల్లా దవాఖానకి (1), భద్రాచలం ఏరియా దవాఖానకు(1) అంబులెన్స్ , రాష్ట్ర ప్రభుత్వం నుంచి అంబులెన్స్(1) ఆర్టీసీ నుంచి సంచార కోవిడ్ టెస్ట్ వాహనం(1) లను రవాణా మంత్రి పువ్వాడ ప్రారంభించారు. అలాగే ప్రభుత్వ దవాఖానలో ఏర్పాటు చేసిన కొవిడ్ ఐసోలాషన్ వార్డ్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన వెంటిలేటర్ లను ప్రారంభించారు. ఆయా పరిస్థితులను పరిశీలించారు. కరోనా పాజిటివ్ వస్తే ప్రజలు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. ఒక్క పైసా ఖర్చు లేకుండా పూర్తి ఉచితంగా చికిత్స ను అందజేస్తామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఎంవీ రెడ్డి, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, జడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, వెంకటేశ్వర్లు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, డీఎంహెచ్ వో, ఆర్టీసీ ఆర్ ఎం కృష్ణ మూర్తి, డీఎం శ్రీహర్ష, వైద్యులు, నాయకులు ఉన్నారు.

# అక్రమాలను ప్రశ్నిస్తే కేసులు పెడతారా

## -అధికార పార్టీ నేతలపై మండిపడ్డ కాంగ్రెస్ నేతలు

వరంగల్,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): అధికారం అండ చూసుకుని ప్రశ్నించిన వారందరిపై కేసులు పెట్టి అణచివేయాలని చూస్తున్నారని అధికార పార్టీ నేతలపై కాంగ్రెస్ మండిపడింది. అయితే దీనిని సహించబోమని వరంగల్ కాంగ్రెస్ నేతలు స్పష్టం చేశారు. వరంగల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి, జనగామ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు జంగారాఘవరెడ్డి తదితరులు వరంగల్‌లో మీడియాతో మాట్లాడుతూ టీఆర్ఎస్ పార్టీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. ప్రశ్నించే నాయకులపై కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. అణిచివేతకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రశ్నిస్తే కేసులు పెడతారా?ఇక సహించబోమని స్పష్టం చేశారు. కేసులపై పెట్టిన శ్రద్ధ అభివృద్ధిపై పెట్టండి? వరంగల్ అభివృద్ధి పై టీఆర్ఎస్ పార్టీ చర్చకు సిద్ధమా..? అని ఆయన సవాల్ చేశారు. మంత్రి కేటీఆర్ వరంగల్ కు వస్తే మమ్ములను హౌజ్ అరెస్ట్ చేస్తారా..? టీఆర్ఎస్ నాయకులు ఖబడ్దార్? ఇకపై కేసులు పెట్టి వేధిస్తే భయపడబోమన్నారు. జనగామ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు జంగారాఘవరెడ్డి మాట్లాడుతూ.. టీఆర్ ఎస్ నేతలకు పోలీసులు ఏజెంట్లు గా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కేసులకు భయపడి పార్టీలు మారబోమన్నారు. మంత్రి దయాకర్ రావు ఓటమి భయంతోనే టీఆర్ఎస్ లో చేరారు.. ఆనాడు నమ్మి చేరదీసిన చంద్రబాబును వెన్నుపోటు పొడిచిన చరిత్ర దయాకర్ రావుదని విమర్శించారు. ఒక రేషన్ డీలర్ కు వందలకోట్లు ఎలా వచ్చాయి ? ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. భార్యకు తాళి కట్టాలన్నా? దయాకర్ రావుకు కమిషన్ ఇవ్వాల్సి వస్తుందేమోనన్న పరిస్థితులు వరంగల్ జిల్లాలో ఉన్నాయని ఆరోపించారు. డీసీసీబీ బ్యాంకులో నేను ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదు.. డీసీసీబీ బ్యాంకును లాభాల్లో నడిపిన చరిత్ర మాది అన్నారు.

# పేద ప్రజలకు అండగా డబుల్ ఇళ్లు

## కొత్త ఇల్లను ప్రారంభించిన మంత్రి పువ్వాడ

భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): పేద ప్రజలు ఆత్మ గౌరవంతో జీవించాలన్న ఉద్దేశంతో పైసా ఖర్చులేకుండా ఇండ్లు లేని నిరుపేదలకు అన్ని సదుపాయాలతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ను ప్రభుత్వం అందజేస్తుందని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు.

జిల్లాలోని జులురుపాడు మండలం పడమటి నర్సాపురంలో రూ. 5.03 కోట్లతో 80 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, దుబ్బతండా గ్రామంలో రూ. 2.26 కోట్లతో 45 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, రామచంద్రపురంలో రూ. 3.27 కోట్లతో 65 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఎలకలఒడ్డు గ్రామంలో రూ. 1.76కోట్లుతో 35 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మొత్తం రూ. 12.32 కోట్లతో నూతనంగా నిర్మించిన 225 ఇండ్లను ఎమ్మెల్యే రాములు నాయక్‌తో కలిసి మంత్రి పువ్వాడ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదలు ఆత్మగౌరవంతో జీవించాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన అన్నారు. అందుకే భారీ వ్యయంతో కూడుకున్నప్పటికి రెండు పడకల గదుల ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇండ్ల కేటాయింపు పూర్తి పారదర్శకంగా చేపట్టామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 500కు పైగా డబుల్ బెండ్ రూమ్ ఇండ్లను నిరుపేదలకు అందజేశామన్నారు.

నిర్మాణంలో ఉన్న మిగతా గ్రామాల్లో ఇండ్లను కూడా త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభిస్తామన్నారు. కరోనా విస్తరిస్తున్న సమయంలో భౌతిక దూరం పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

# సంక్షోభంలోనూ సంక్షేమానికే ప్రాధాన్యం : మంత్రి హరీశ్ రావు



సంగారెడ్డి, ఆగష్టు 28: కరోనాతో ఆదాయం తగ్గినా సీఎం కేసీఆర్ సంక్షేమ కార్యక్రమాలు ఆపడంలేదని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు.

సంగారెడ్డి కలెక్టరేట్‌లో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్ లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కరోనా సంక్షోభంలోనూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఆగడం లేదన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని మంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 7,400 కోట్లు రైతుబంధు సాయం అందజేశామన్నారు. ఈ విపత్కర సమయంలో కూడా పేదల ఆసరా పెన్షన్ల కోసం వేయి కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు.

# కరోనా రోగులను ఆదుకోండి

## ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు దగ్గర కండి
## ప్రజాప్రతినిధులకు మంత్రి ఎర్రబెల్లి సూచన

హైదరాబాద్,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): ఓట్లప్పుడే కాదు కష్టకాలంలోనూ ప్రజల్ని ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలని పంచాయితీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. కరోనా బాధితుల స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకుని వారికి సాయం అందించాలన్నారు. తిండికి ఇబ్బంది ఉన్న వారికి చందాలు వేసుకుని సాయం చెయ్యాలన్నారు. బాధితులకు భరోసాని, ధైర్యాన్ని ఇవ్వాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులపై ఉందన్నారు. హాస్పిటల్స్‌లో, క్వారంటైన్‌లో ఉన్న కరోనా బాధితులు, వారి కుటుంబ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడిన మంత్రి ఎర్రబెల్లి బాధితుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్ నుంచి తన నియోజక వర్గమైన పాలకుర్తిలోని పరిస్థితులను మంత్రి అడిగి తెలుసుకున్నారు.

మీరు అధైర్య పడొద్దు, మీకేం కాదు, కరోనాతో భయపడాల్సిం దేమీ లేదన్నారు. ప్రైవేట్ హాస్పిటల్స్‌కు మించి వసతులు ప్రభుత్వ దవాఖానాల్లో ఉన్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దయవల్ల మంచి వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని అన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ కరోనా తీవ్రత తగ్గిందన్నారు. సీఎం కేసీఆర్,మంత్రి కేటీఆర్‌ల ఆధ్వర్యంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలన్నీ సఫలమయ్యాయని అన్నారు. ప్రజలు స్వీయ నియంత్రణ, సామాజిక దూరం పాటించడంతో పాటు తప్పకుండా మాస్కులు ధరించాలన్నారు. కరోనా వచ్చిన వారు కూడా ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. ప్రభుత్వం సాయంగా ఉందని, ఎంజీఎంసహా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కరోనా పరీక్షలతో పాటు తగిన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచామన్నారు.

# మూడోరోజు కొనసాగిన ఏసిబి విచారణ

## -కోటి లంచంపై కూపీ లాగిన అధికారులు

హైదరాబాద్,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): కీసర తహసీల్దార్ లంచం కేసులో అనిశా అధికారుల విచారణ కొనసాగుతోంది. విచారణలో భాగంగా మూడు రోజుల పాటు నిందితులను అనిశా కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్న విషయం తెలిసిందే. గురువారం చివరి రోజు కావడంతో నిందితుల నుంచి కీలక సమాచారం రాబట్టేందుకు అనిశా అధికారులు ప్రయత్నిస్తున్నారు. రెండు రోజుల విచారణలో అధికారులు అడిగిన ప్రశ్నలకు నిందితులు సమాధానాలు ఇవ్వకుండా మౌనం వహించినట్లు సమాచారం. కేసుకు సంబంధించి ఇతర అధికారుల పాత్ర, తహసీల్దార్ ఇంట్లో దొరికిన లాకర్ తాళం.. స్థిరాస్తి వ్యాపారులకు ఆ డబ్బు ఎలా వచ్చింది? తదితర ప్రశ్నలకు నిందితుల నుంచి ఎలాంటి సమాధానం రానట్టు తెలుస్తోంది. దీంతో వారి నుంచి కీలక సమాచారం రాబట్టేందుకు అనిశా అధికారులు ప్రయత్నిస్తున్నారు. మరి కాసేపట్లో నిందితుల కస్టడీ సమయం ముగియనుండగా.. ఆ లోపు వాళ్ల నుంచి కావలసిన సమాధానాలు రాబట్టేందుకు అనిశా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. కోట్ల రూపాయల విలువైన భూమిని నిబంధనలకు విరుద్ధంగా స్థిరాస్తి వ్యాపారుల పేరు మీద మార్చడానికి తహసీల్దార్ నాగరాజు రూ.రెండు కోట్లు లంచం డిమాండ్ చేశారు. ఈ క్రమంలో స్థిరాస్తి వ్యాపారులు అంజిరెడ్డి, శ్రీనాథ్ కలిసి నాగరాజుకు రూ. 1.10కోట్ల లంచం ఇస్తుండగా పక్కా సమాచారంతో అనిశా అధికారులు పట్టుకున్న విషయం తెలిసిందే.

# చెరువులో పడి వ్యక్తి మృతి

సిద్దిపేట,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): జిల్లాలోని తొగుట మండలం పల్లెపహాడ్ గ్రామంలోని ఖాదరు చెరువులో పడి శివలింగు మల్లయ్య(45) అనే వ్యక్తి మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు కొమురవెల్లి గ్రామ శివారు వ్యవసాయ పొలాల వద్ద విద్యుత్ హైటెన్షన్ స్థంబానికి గుర్తుతెలియని మహిళ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
Editor: B. Devadas, Cell: 9000065433
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com